# రూతు గ్రంథము

## ప్రేమ చరిత్ర

ఈ గ్రంథములో నాలుగు భాగములున్నవి.

1) దేశాంతరము పోవుట,

2) మోయాబులోని దుఃఖచరిత్ర,

3) స్వదేశమునకు వచ్చుట,

4) విమోచన చరిత్ర.

ఎలిమెలెకు అను యూదుడు తన భార్య అయిన నయోమిని వెంటబెట్టుకొని 10 సం॥లు మోయాబు దేశములోకి వెళ్లెను. ఈ రూతు కథ న్యాయాధిపతులలోని కథ (రూతు 1:1). అనగా న్యాయాధిపతుల కాలములో అప్పుడు కరవు ఉన్నదని ఎలీమెలెకు మోయాబుకు వెళ్లెను. మోయాబీయులను ఇశ్రాయేలు సమాజములో చేర్చకూడదు (ద్వితీ. 23:3-5). 10 సం॥ల తరువాత ఇశ్రాయేలీయులకు ఆహారము ఇచ్చుటకు దేవుడు దిగివచ్చియున్నాడని మోయాబులో వారు విన్నారు. అనగా పారిపోయినవారు తిరిగి వచ్చుటకు సిద్ధపడ్డారు. ద్వితియోపదేశ కాండములో మోషే మరలా ఉపదేశించినట్లు, ఈ రూతు చరిత్రను మరలా చెప్పుటకు ఈ క్లాసు పెట్టడము అయినది. ఈ రూతు కథ కరవువలన కలిగినది. అందునుబట్టి మోయాబు వెళ్లారు. 10 సం॥లు ఉన్నారు, మరలా తిరిగివచ్చారు.

**రూతు నయోమితో మాట్లాడిన ముఖ్య విషయములు:**

1) 'ఓ అమ్మాయీ! నీవు నీ దేశములో ఉండిపో, నాతో రావద్దు, అని అనవద్దు

2) నీవు ఎక్కడకు వెళ్ళుదువో నేను అక్కడకు వస్తాను

3) నీవు ఏ దేవుడిని పూజిస్తావో నేను ఆ దేవుడినే పూజిస్తాను

4) నీ జనమే నా జనము అని రూతు నయోమితో అన్నది. ఇక్కడ ముఖ్యమైన మాట ఏమిటంటే **'నీ దేవుడే నా దేవుడు'.** అందుకే ఈ పుస్తకము బైబిలులో వ్రాయబడినది.

నయోమి, తన సొంత దేశము వెళ్ళిన తరువాత అందరూ ఆమెను నయోమి అనుచుండగా, నన్ను నయోమి అనవద్దు 'మారా' అని అనమనెను. ఈ నయోమితో, యౌవనస్థురాలైన ఆమె కోడలుకూడ వచ్చెను. ఈ మధ్య మన దేశములో ఒక వాదము ఉన్నది. పెనిమిటి పోయిన దానిని వివాహము చేసికొనవచ్చునా? వారేమంటున్నారంటే పురుషులు చేసికొనవచ్చును, స్త్రీలు చేసికొనకూడదు అంటున్నారు. క్రైస్తవులు– ఈ పుస్తకమును బట్టి రూతు చేసుకున్నట్లు మా బైబిలులో ఉన్నది. కాబట్టి చేసికొనవచ్చును అని అనుచున్నారు. బోయజు వివాహము లేనివాడు, రూతు పిల్లలను కనిని స్త్రీ. నయోమి మోయాబు నుండి వచ్చేటప్పుడు రూతు వచ్చినదని బోయజు తప్ప తక్కిన వారందరు చెప్పుకొనిరి. ఎందుచేతననగా వారు వచ్చినప్పుడు ఆయన దేశములో లేడు, యుద్ధములో ఉన్నాడు.

**వింత సంగతి:–** పెనిమిటి పోయిన వారిని, పెండ్లికాని పురుషులు పెండ్లిచేసికొనరు ఇక్కడ విపరీతమైన వివాహము బోయజు చేసికొనెను. బోయజు పడుచువాడు. ఆ కాలములో మిల్టరీవారు అధికముగా యున్నారు. అందరు నయోమినిగూర్చి చెప్పుచున్నప్పుడు బోయజు లేడు, మిల్టరీలోఉన్నాడు. మిద్యాను యుద్ధమునకు వెళ్లెను. యూదులలో ఒక ధర్మశాస్త్ర నియమమున్నది. ఒకని సహోదరుడు చనిపోతే అతని భార్యను వాని తమ్ముడు చేసికొనవచ్చును. మోషే ఆలాగు వ్రాసినారు. ఇది విపరీతమైన వివాహము గనుక ఘనమైన పెండ్లి.

'విమోచనము' అనగా అన్నగారి పేరు నిలువబెట్టుటకు బోయజు ఆలాగు చేసెను. యేసుక్రీస్తు జన్మమునకుముందు అన్యులను పెండ్లిచేసికొనకూడదు. యూదులు యూదులనే పెండ్లిచేసికొనవలెను. గాని వీరి వివాహమునకు అందరు ఒప్పుకొన్నారు. అంతా చేసినది ముసలమ్మే గనుక ఇది విపరీతమైన కథ.

పెండ్లికానివాడు పెండ్లి అయిన దానిని చేసికొనుట విచిత్రమైనది. యూదులు అన్యులను వివాహము చేసికొనకూడదు. ఎందుచేతననగా ప్రభువు యూదులలో నుండి రావలెను గాన సంకరము ఉండకూడదు అని యూదులు నిష్టగా ఉండిరి. ఈ రూతు పెండ్లికి మాత్రం యూదులంతా (పెద్దలందరూ) ఒప్పుకొనిరి. బోయజు నయోమియొక్క బంధువుడైనాడు. అది దేవుని ఏర్పాటు గనుక అట్లు జరిగినది (మోయాబీయులు ఎందుకు శపించబడిరి? ఇశ్రాయేలీయులను శపింపవలెనని బిలామును పిలిపించిరి). గనుకనే రూతు గ్రంథము చివరి పేరా చదివితే బోయజు వంశము తేలెను. బోయజు ఒబేదును, ఒబేదు యెష్షయిని, యెష్షయి దావీదును, దావీదు మరియమ్మను, మరియమ్మ యేసును కనెను. ఈ సంగతి చెప్పుటకై ఈ గ్రంథము బైబిలులో చేర్చబడినది. (తన వంశావళినిబట్టి) రూతు యేసునకు తల్లి అయినది. లోతు కుమారుడు మోయాబు. మోయాబు సంతానమే మోయాబీయులు. మోషే చేతిలో ధర్మశాస్త్రము ఉన్నది. కృపాశాస్త్రము యేసుచేతిలో ఉన్నది. మోషే ధర్మశాస్త్రము అన్యులను పోనియ్యదు, అయితే ప్రభువుయొక్క కృపాశాస్త్రము రానిస్తుంది. ధర్మశాస్త్రము ఎవరిని చేరనియ్యదో, కృపాశాస్త్రము వారి హృదయమునుబట్టి వారిని చేరనిచ్చును (శరీరరీతిగా రూతు మోయాబీయురాలే గానీ ఆత్మరీతిగా మత విషయములో యూదా గోత్రికురాలైనది) బైబిలులో ప్రత్యేకముగా మరి ఇతర కథలు చేరక, కేవలము స్త్రీ కథ మాత్రమే కలిగిన గ్రంథములు;

రూతు గ్రంథము, ఎస్తేరు గ్రంథములైయున్నవి. దేవుడు, స్త్రీలను గౌరవించుచున్నట్లు ఈ రెండు పుస్తకములు ఉన్నవి. స్త్రీలను బైబిలు సన్మానిస్తున్నట్లు ఈ రెండు పుస్తకములు చెప్పుచున్నవి. రూతుయొక్క భర్త యూదుడు. దేవుని జనాంగములో చేరిన రూతు అన్యురాలు.

రూతు– అన్యురాలు; బోయజు యూదుడు

ఎస్తేరు –యూదురాలు; అహష్వేరోషు అన్యుడు.

అన్యులను, యూదులను ఏకముచేసి వారిలోనుండి రక్షకుని రప్పించే పనిమీద దేవుడు మోయాబు నుండి రూతును రప్పించెను. యూదులు ఎప్పుడు ఒక విషయములో బహు నిష్టగలిగి యున్నారు. అదేదనగా 'మేము దేవుని జనాంగము.' పెండ్లికుమార్తె రెండు భాగములు; 1) సజీవుల గుంపు, 2) మృతుల గుంపు. పెండ్లికుమార్తెలో విశ్వాసులైన యూదులును, అన్యులును ఉందురు. ఈ విషయము తెలియజేయుటకై రూతు గ్రంథము వ్రాయబడెను. అన్యులును, యూదులును కలిసి పెండ్లికుమార్తె కాబోవుచున్నదను దానికి ముంగుర్తుగా ఈ గ్రంథమును సమూయేలు వ్రాసెను.

బోయజు మీదనున్న ప్రేమ చొప్పున రూతు ఆయనను పెండ్లి చేసికొనలేదు గాని అత్తగారిమీద ఉన్న అభిమానము చొప్పున ఆయనను చేసికొనుటకు ఆమె అంగీకరించెను. ఇదియు ఒక విచిత్రమైన సంగతి. రూతుకు అత్తగారియందున్న అభిమానము ఎంతవరకు వచ్చినదనగా క్రీస్తు జన్మ చరిత్రలో చేరువరకు వచ్చినది. ఇప్పటికాలములో అత్తకు, కోడలికి ఎందుకు పడదు? అత్తగారు కోడలిమీద అధికారము చేస్తారు. **అత్తగారు ఎంత స్వతంత్రురాలో కోడలును ఆ ఇంట అంతే స్వతంత్రురాలు గాన కోడలిని ఏమియు అనకూడదు.** కారణాలేలాగున్నను ఒక గృహమునందున్న అత్తకోడలికి; రూతు నయోమిల చరిత్ర బాగున్నది. అభిమానము ఉభయులకు యుండవలెను. అది అందరికి

యుండవలెను. భార్యభర్తలకు అభిమానము, గౌరవము అనునది యుండిన కుటుంబము నెమ్మదిగాను, నీతిగాను యుండును. బైబిలు మిషనులో అత్తకు కోడలికి, భార్యకు భర్తకు సమాధానముగా యుండుట శుభము.

సీమ దేశములో (విదేశాలలో) అత్తగారు కోడలిని ఏమీ అనరని ఒక దొరగారు అన్నారు. కారణమెట్లు ఉన్నను అత్తగారికిని, కోడలికిని నయోమి రూతులవంటి అభిమానమే కలిగి ఉండవలెను. ఈ అభిమానము ఉభయులకు ఉండవలెను. భార్యభర్తలు ఒకరి యెడల నౌకరు సమాన అభిమానము కలిగి ఉండవలెను. రూతు గ్రంథములో ఉన్న ఈ చరిత్ర కల్పించిన కథవలె ఉన్నది గానీ ఆలాగు ఎంత మాత్రమునుకాదు. దేవుని సంకల్పన ఆలాగున్నది. బైబిలు మిషనులో ఏ కుటుంబములో అత్త, కోడలికి అభిమానముండునో అది ధన్యమైనది.

డా॥ శామ్యేల్ జాన్‌సన్ ఇంగ్లీషు డిక్షనరీ వ్రాసెను. ఒకప్పుడు క్లబ్‌లోనికి వెళ్లెను. అచ్చటివారందరు బైబిలు సోమరుల పుస్తకమని ఎగతాళి చేసిరి. ఈయన రూతు చరిత్ర ఒక కాగితము మీద వ్రాసికొని వెళ్ళి వారందరు తిని త్రాగుచుండగా ఈ కథ చదువుతాను వినుమని చదివి వినిపించెను. వారందరు ఈ నవలు చక్కగానున్నది. బహు రమ్యముగా నున్నది. ఏ పుస్తకములోనిది అని అడిగిరి. ఇది బైబిలులోనిదే అని చెప్పగా వారందరు ఆశ్చర్యపడిరి. చాలా సంతోషించిరి. ప్రేమ చరిత్ర అభిమానమును బట్టి ఏర్పాటైనది. అందరు అట్టి అభిమానమును గౌరవించవలెను. అభిమానము లేనివారికి ఇట్టి కథలు ఇష్టముండదు గాని ఇంగ్లీషువారికిష్టము. కారణమెట్లున్నను అత్త, కోడలు అభిమానమును కలిగియుండవలెను. కుటుంబ జీవితము సరిగా నుండవలెనని ఈ గ్రంథము బోధించుచున్నది.

# రూతు కథ

1. న్యాయాధిపతుల కాలములో కరువు సంభవించినది. అప్పుడు ఎలీమెలెకు, నయోమి మరియు వారి ఇద్దరు కుమారులు మోయాబు దేశమునకు వెళ్ళిరి. మోయాబీయులకు, హెబ్రీ వారికి సంబంధములేదని మోషే బోధించెను (ద్వితీ. 23:3-6). అయితే, ఇది 10 సం॥ల క్రిదట జరిగిన కథ; నయోమి భర్త, ఇద్దరు కుమారులు చనిపోయిరి. దేవుడు వారిని ఆశీర్వదించుటకు దిగివచ్చెనని ఆమె మోయాబు దేశములో వినెను. వెంటనే స్వదేశమునకు బైలుదేరెను. ఇది ఈ చరిత్ర పరిచయము.

2. రూతు కథ బైబిలులో ఎందుకు చేర్చవలెను? అని అనేకులు అడుగుచున్నారు. రూతు మాటలలో దీనికి జవాబు కలదు. 1) నీవు నివసించు చోటున నేను నివసించెదను 2) నీ జనమే నా జనము. 3) నీ దేవుడే నా దేవుడు 4) నీవు చనిపోవు చోటనే నేనును చనిపోవుదును. 5) మరణము తప్ప మరి ఏమియు మనలను విడదీయకుండునుగాక! 6) ***నీ దేవుడే నా దేవుడు*** అను మాటనుబట్టి ఈ గ్రంథము బైబిలులో చేర్చబడినది. ఇది మహాగొప్ప పలుకు. ఇది యూదులకు ఇష్టమైన మాట గనుక ఈ గ్రంథము బైబిలులో చేర్చిరి. ***ఆలాగే పెండ్లికుమార్తెకూడ మరణ పర్యంతము 'ప్రభువా! నిన్ను విడువను' అని ప్రమాణము చేయవలెను.***

3. మోషే చెప్పినట్లు మోయాబీయులు ఇశ్రాయేలీయులలో చేరకూడదు. వారి వంశము నిష్కళంకముగా ఉండవలెను. అయితే బోయజు, రూతు యొక్క వివాహమునకు పెద్దలు అందరు అంగీకరించిరి, సంతోషించిరి, రూతును దీవించిరి. మోయాబు దేశములోనుండి వచ్చిన రూతును బోయజు పెండ్లి చేసికొని, ఆమెను రక్షించెను.

4. మోయాబీయులు ఇశ్రాయేలీయులను శపింపవలెనని బిలాము అను ప్రవక్తకు లంచమిచ్చిరి. అయితే దేవుడు ఆ శాపమును దీవెనగా మార్చివేసెను.

5. బోయజు ఎలీమెలెకు సంతతివాడు గనుక రూతును వివాహము చేసికొని ఆమెను విమోచించెను. ఆమె అన్యురాలు, బోయజు యూదుడు. అయినను వారు రూతును చేర్చుకొని దీవించిరి. రూతు అన్యులలోనుండి (ఇశ్రాయేలీయులు కానివారు) వచ్చుటద్వారా రాకడకు సిద్ధపడవలసిన పెండ్లికుమార్తెకు ఆమె సూచనయై ఉన్నది. ధర్మశాస్త్రము ఆమెను దేవుని జనములో చేర్చుకొనదు గాని, రానైయున్న క్రీస్తుప్రభువు చేతిలోనున్న కృపాశాస్త్రము ఆమెను రానిచ్చెను.

6. బోయజు కొడుకు ఒబేదు, ఒబేదు కొడుకు యెష్షయి, యెష్షయి కొడుకు దావీదు. దావీదు వంశములోనుండి మరియమ్మ యేసుప్రభువు వచ్చిరి. ఈలాగు రూతు వరుసకు యేసుప్రభువుకు తల్లి అయ్యెను.

7. బైబిలు కథలలోని స్త్రీలను గూర్చి కథలలో ముఖ్యమైనది రూతు గ్రంథము. బైబిలులోని 66 పుస్తకములలో రూతు చరిత్ర, ఎస్తేరు చరిత్ర ప్రత్యేకముగా వ్రాయబడినవి. స్త్రీలను గురించి వ్రాయించుటవలన దేవుడు స్త్రీలను గౌరవపర్చినట్లు కనబడుచున్నది. రూతు అన్యురాలు, భర్త యూదుడు. ఎస్తేరు యూదురాలు, భర్త అన్యుడు. దేవుడు రూతును ఇశ్రాయేలీయుల దేశమునకు రప్పించుటవలన అన్యులను, యూదులను ఏకముచేసి వారిలోనుండి రక్షకుని రప్పించుటకు ఆమెను తీసికొనివచ్చెను. అది దేవుని సంకల్పము. రక్షకుడు రాకముందే, అనగా 1500 సం॥ల క్రితమే అన్యులను, ఇశ్రాయేలీయులను దేవుడు ఏకముగా చేసెను. ఇది రూతు గ్రంథములో నున్నది.

8. యూదులు– 'మేము దేవుని జనము, మాలోనికి అన్యులు రాకూడదు' అని వాదించుదురు కాని మేఘములో ఎత్తబడే సంఘములో రెండు గుంపులుండును. 1) మృతుల గుంపు 2) సజీవుల గుంపు. ఈ రెండు గుంపులలో కూడ విశ్వాసులైన యూదులు, అన్యులు ఉండవలెను. **అన్యులు వచ్చేవరకు పెండ్లికుమార్తె పూర్తికాదు.**

9. ఈ రూతు గ్రంథము ఎడారిలోని ఒయాసిస్సు అనగా నీటిబుగ్గ వలె నున్నది. ఇది ఒక ప్రేమ కథ. ***పరిశుద్ధమైన ప్రేమ, ఎటువంటి కష్టమునైనను జయించగలుగునని ఈ గ్రంథము బోధిస్తుంది.*** పెండ్లికుమార్తె కూడ తనకు ప్రభువుయెడల ఉన్న పరిశుద్ధ ప్రేమనుబట్టి లోకములోనున్న కష్టములన్నిటిని జయించవలెను. యువతీ, యువకుల మధ్యనున్న ప్రేమ, ఇందులో లేదుగాని ఒక యౌవనస్థురాలు తన అత్తగారి యెడల కలిగిన గాఢమైన ప్రేమను ఈ కథ చూపించుచున్నది.

10. బోయజుకంటె గొప్పవాడైన క్రీస్తుప్రభువు అన్యులైన మనలనందరిని తన రక్తముద్వారా విమోచించెనని అనుటకు ఈ గ్రంథము సూచనగా ఉన్నది. రూతు మోయాబీయులలో ఒక పాపి. ఇశ్రాయేలీయులలో చేరకుండా దూరముగా నుండవలెను, పేదరాలు, అక్కరలు గలది. అయితే, బోయజు వివాహము చేసికొనుట వలన విమోచింపబడెను. ఆలాగే పెండ్లికుమార్తెకూడ ఒకానొకప్పుడు, పాపివలె దూరముగా నుండి వత్మ విషయములో పేదరికము కలది, అన్ని అక్కరలు కలది. అయితే క్రీస్తుప్రభువుని వెదకిన తరువాత రూతుకు విశ్రాంతి దొరికినట్లు పెండ్లికుమార్తెకుకూడ విశ్రాంతి దొరికెను.

బోయజు క్రీస్తును పోలినవాడు, కోతకు అధిపతి, యుద్ధశూరుడు, రూతును చూచుటతోనే దయగా మాట్లాడి ఆదరించినవాడు. ఆలాగే క్రీస్తుప్రభువు కోత కోయించును (దూతలతో), యూదా గోత్ర సింహముగా సాతానును ఓడించిన యేసుప్రభువే,

సంఘము అధిక కష్టములలోనుండి తన నొద్దకురాగానే, ఆయన ఆదరించి తన గాయములలో మనలను చేర్చుకొని, మనలను విమోచించి, తనతో ఐక్యము చేసికొనేవాడైయున్నాడు. బోయజు రూతును ఆదరించిన రీతిగా క్రీస్తు సంఘమును ఆదరించును.

# రూతు తీర్మానము

**తండ్రి: రూతు 1:16; కుమార యోహాను 15:1-15; పరి. రోమా 8:38-39.**

## రూతు గ్రంథముయొక్క వర్తమానము

**విమోచనద్వారా విశ్రాంతి, ఆ విశ్రాంతి యేసుప్రభువు పాదమువద్ద దొరుకును.**

1. ఈ గ్రంథముయొక్క అర్థము ప్రేమ కథ. రూతుయొక్క రక్తము ప్రభువుయొక్క రక్తనాళములలో ప్రవహించెను. లోకములో అనేక ప్రేమ కథలున్న పుస్తకములు కలవు. అవి అపవిత్రత ప్రేమగాధలు. రూతు చరిత్ర అటువంటి ప్రేమ చరిత్రకాదు. 2. ఇది ఒక పవిత్రమైన ప్రేమ కథ. కోడలు మిక్కుటముగా తన అత్తను ప్రేమించిన ప్రేమ గాధ. భక్తులు దీనికి ***పరిశుద్ధ ప్రేమ కథ*** అని పేరుపెట్టినారు. 3. రూతుయొక్క వివాహము లోకమంతటికి మాదిరిగానున్నది. దేవుడు ఏర్పరచిన ఈ వివాహములో శరీర ఆశగాని, లోకాశగానలేదు. ***దేవుడు వివాహమును ఏర్పాటుచేసిన ఉద్దేశము, ఆమె వివాహములో సంపూర్ణముగా నెరవేరినది.*** 4. సంతానాభివృద్ధి దేవునియొక్క ఉద్దేశ్యము. అది ఆమె వివాహములో నెరవేరినది. ప్రస్తుతకాల వివాహములు ఆ దేవుని ఉద్దేశమును నెరవేర్చుటలో వెనుకబడినవి అట చెప్పక తప్పదు.

**రూతు తీర్మానములో** 7 అంశములు కలవు.

**1) (1:16) నీవు వెళ్ళుచోటికే నేను వచ్చెదను:-** మనలను ప్రభువు ఫలాన చోటికి వెళ్లు అని చెప్పినప్పుడు , వెళ్ళమన్న చోటికి

వెళ్ళి తీరవలెను. అట్లు లోబడని యెడల ప్రభువుతో మనము తీర్మానము చేయనట్టే.

**2) (1:16) నీవు నివసించుచోటనే నేను నివసింతును:-** ప్రభువు ఉన్నచోటునే విశ్వాసి జీవించవలెను. ఆయన సలహానుబట్టి సేవ చేయవలెను. భూలోకములో ఆయనతో సహవాసము చేసినవారే, (యోహాను 14:2)లో నా తండ్రి ఇంట అనేక నివాసములు గలవు అని ప్రభువు చెప్పినట్లు, ఆ తండ్రి నివాసములలో చేరగలరు.

**3) (1:16) నీ జనమే నా జనము:-** క్రీస్తుప్రభువుని అంగీకరించిన తరువాత ఆయన ప్రజలయొక్క సహవాసములోనికి వెళ్లవలెను. అదే భూలోక పరిశుద్ధులయొక్క సహవాసము. ***ఈ సహవాసము దేశము, భాష, రంగు ఈ తేడాలు లేకుండా ఉండును.***

**4) (1:16) నీ దేవుడే నా దేవుడు:-** రూతుయొక్క తీర్మానములోని ఈ వాక్యము ఈ చరిత్ర అంతటికిని గుండె వంటిది, చాలా ప్రాముఖ్యమైనది. క్రీస్తును అంగీకరించిన విశ్వాసి దేవుని బిడ్డ గనుక వెంటనే దేవునియొక్క కుటుంబములో ప్రవేశించుట జరుగును. 'నా దేవుడు' అనుటలో మన పూర్వపు ఆచారములు, పద్ధతులు అన్నిటిని పూర్తిగా విడిచి బైటకు వచ్చుట ఉన్నది గనుక అది సంపూర్ణమైన మెట్టు.

రూతు గ్రంథమునకు పరిశుద్ధమైన నవల అను పేరుపెట్టి, ఇంగ్లీషు డిక్షనరీ వ్రాసిన డా॥ శామ్యేల్ జాన్‌సన్‌గారు క్లబ్‌లో ఉన్నవారికి ఈ గ్రంథమును చదివి వినిపించి, యేసుక్రీస్తు ప్రభువులోనికి వారిని నడిపించారు. అత్తకు, కోడలకు గల పరిశుద్ధ ప్రేమ ఈ గ్రంథములో ఉన్నది. ప్రతి విషయములోను నయోమి ఆజ్ఞమీదే రూతు నడుచుచున్నది. ఈమె సంతానములోనుండి యేసుక్రీస్తు ప్రభువు వచ్చారు. అందుకనే ఈ మోయాబీయురాలు దేవునికి తల్లి అయినది. పుల్లటి మామిడి తెచ్చి మంచి మామిడికి అంటుకట్టినట్లు, అన్యులమైన మనలను ప్రభువుతో

అంటగట్టినారు గనుక మనము గొప్పవారము. స్త్రీల పేరుమీద బైబిలులో ఎన్ని పుస్తకములున్నవి? రూతు, ఎస్తేరు. వీరిద్దరకు ఏమితేడా? ఇశ్రాయేలీయురాలైన ఎస్తేరు, అన్యరాజును పెండ్లిచేసికొన్నది. అన్యరాలైన రూతు, బోయజులో కలసిపోయినది. అన్యరాజులో ఎస్తేరు కలిసిపోలేదు. ఎస్తేరు చెప్పితే రాజు విన్నాడా? లేదా? విన్నాడుకదా! ఆలాగే పెండ్లికుమార్తె చెప్పితే యేసుక్రీస్తు ప్రభువు వినడా? వింటాడు. పరలోక ప్రార్ధనలో స్తుతి చేర్చకపోతే ఆ ప్రార్ధన సంపూర్ణముకాదు. పెండ్లికాని క్రితము ఇల్లు అల్లకల్లోలముగా ఉండును. పెండ్లి అయిపోయిన తరువాత అల్లరిగా ఉండదుకదా! విమోచనద్వారా విశ్రాంతి పొందగలము. ఇదే రూతుయొక్క ముఖ్య వర్తమానము. విడిచిపెట్టేవాటిని విడిచిపెట్టి రావలసిన వాటివద్దకు వచ్చినది గనుక రూతునకు విమోచన కలిగినది.

1) విడిచిపెట్టవలసినవి విడిచిపెట్టినది 2) చేరవలసిన చోటునకు చేరినది గనుక విమోచన దొరికినది. విడిచిపెట్టవలసిన వాటిని విడిచి పెట్టనపుడు విమోచన దొరకలేదు. గనుక మనము విడువవలసిన వాటిని విడిచిపెట్టి, చేరవలసిన చోటికి చేరవలసి యున్నాము. ఓ విశ్వాసీ! విడిచిపెట్టవలసినవి విడిచిపెట్టి ప్రియుని చెంతకు చేరుము. అన్య జనాంగములో అనేకమంది నీతిగా ఉన్నారు గాని వారికి విమోచన ఉన్నాదా? యేసుక్రీస్తు ప్రభువు యొద్దకు చేరినపుడే పరిశుద్ధత, విమోచన దొరుకును.

2) రూతు అను యౌవనస్థురాలి చరిత్ర, ఈ నాలుగు అధ్యాయములలో వ్యాపించియున్నది. ***దీనికి చక్కదనము విచారమును బట్టి కలిగినది.*** మామగారును. పెనిమిటిని బట్టి ఈ గ్రంథమునకు చక్కదనము వచ్చినది. రూతు మొదటి విచారము ఏదనగా, తన అనుభవములో కన్నీరున్నది. ఆ విచారమునుబట్టి తాను బేత్లెహేము

చేరుటవలన; బైబిలు గ్రంథమంతటిలో లోకము ఎన్నడు ఎరుగనిదైన, అత్తపై కోడలికిగల గాఢమైన ప్రేమను ఈ పుస్తకము తెలియజేయు చున్నది. ఈ పుస్తకములో సంగతులు ఎవ్వరు ఎన్నడు ఏ పుస్తకములో వ్రాయలేదు. **ఈ పుస్తకములో ఉన్న చక్కదనము ఏ పుస్తకములోను లేదు.** లోకములో అనేక వ్రాతలు కలవు. ఆ వ్రాతలలో ఉన్న తీర్మానములను మనము పైకి ఎత్తిచూచిన యెడల, రూతు తీర్మానము ముందు అవి ఎందుకును పనికిరావు. రూతు తన అత్తతో మాట్లాడిన మాటలు, ఈలోక పుస్తకములన్నిటిలో ఒక ప్రకాశమానమైన ముత్యము వలె ప్రకాశించుచున్నవి ఇది పెండ్లికుమార్తెయొక్క తీర్మానము. ఓ సంఘమా! నీ తీర్మానము ఎట్లు ప్రకాశించుచున్నది. ఈ రూతు చరిత్ర ఎప్పుడు జరిగింది అంటే న్యాయాధిపతుల కాలములో జరిగినది. న్యాయాధిపతుల గ్రంథమే ఎడారివంటిది. ఎడారిలో ప్రయాణము చేసేవారికి నీరు అవసరము. ఈ రూతు చరిత్ర న్యాయాధిపతుల కాలములో జరిగిన చరిత్ర. ఆ కాలము– పడుట, లేచుట అను గంధరగోళము కలిగినకాలము గనుక అది ఎడారి భూమి వంటిది. అట్టి సమయములో రూతుచరిత్ర జరిగినది గనుక ఎడారిలో దప్పిగొను వారికి నీటి సరస్సు దొరికిన ఎంత ఆనందపడుదురో, ఆ కాలములో జరిగిన రూతు చరిత్ర వారికి అంత ఆనందము కలిగించినది.

3) ఈ పుస్తకమంతా ఒక స్త్రీతో నిండియున్నది. బైబిలులోని ఒక గ్రంథమంతా ఈ స్త్రీ కొరకు కేటాయించబడినది. రూతు అన్యురాలు, ఏర్పాటు సంఘములోనికి వచ్చినది. ఇక్కడ బోయజుని వివాహము చేసికొన్నది. ఓ విశ్వాసీ! నీకు వివాహమైనదా? అన్యురాలైన రూతు ఏర్పాటు జనాంగములోనికి వచ్చి, యేసుక్రీస్తు ప్రభువు వంశావళిలో ప్రవేశించి, యేసుక్రీస్తుయొక్క తల్లులలో ఒకరనిపించుకొని, గొప్ప ఐశ్వర్యవంతురాలు అయినది. ఎస్తేరు అన్యుడైన రాజును వివాహమాడి,

అనగ 12 సంస్థానములు పరిపాలించు చక్రవర్తిని వివాహమాడి తన ప్రజల రక్షణకొరకు ఆ స్థితిని వాడుకొనెను. అట్లే పెండ్లికుమార్తె సంఘముకూడా తనకిష్టమైన కార్యములలో, సంఘ క్షేమకరమైన విషయములు వరునిద్వారా జరిగించుకొనును. చెల్లాచెదురుగా ఉన్న గృహమును క్రొత్తగా వచ్చిన పెండ్లికుమార్తె చక్కబెట్టునట్లు, సంఘ విషయములు చక్కబెట్టుకొనుటకు పెండ్లికుమార్తెకు అధికారము కలదు. రాజ్యము, బలము, జయము; ఈ మాటలు పరలోక ప్రార్థనలో సంఘము కలిపినది. ఆలాగే పెండ్లికుమార్తె చేసినది.

4) ఎలియాజరు 'తన ఇష్టప్రకారము చేయుము' అని ప్రార్థించెను. దేవుడు అలాగే చేసాడు. లోతుకూడా 'అక్కడకు వెళ్ళలేను' అన్నాడు. వెంటనే దేవుడు అంగీకరించాడు.

5) 'నీ దేవుడే నా దేవుడు' అనుటలో రూతు తన పూర్వపు ఆచారములు, పద్ధతులు అన్నిటిని విడిచి బయటకు వచ్చినది. అది సంపూర్ణమైన మెట్టు.

6) 'నీవు మృతిపొందు చోటనే నేనును మృతి పొందెదను.' ఈ తీర్మానమును బట్టి ***విశ్వాసికూడా క్రీస్తుప్రభువుయొక్క మరణానుభవమును కలిగియుండవలెను.*** అనగా తన శరీరమును సజీవయాగముగా క్రీస్తు ప్రభువుకు అర్పించుట, మరణముతో సమానము (రోమా. 12:1). ఆలాగు మరణించినప్పుడే, ఆయన పునరుత్థానములో కూడా పాలు దొరుకును. మరణించిన మనమే క్రీస్తుప్రభువు కొరకు జీవించగలము.

7) 'నీవు పాతిపెట్టబడు చోటనే పాతిపెట్టబడుదును'. విశ్వాసి తన జీవితములో, పాతవాటిని అన్నిటిని మరలా కనబడకుండా పూర్తిగా పాతిపెట్టవలెను. అన్యురాలైన రూతునకు ఏర్పాటు ప్రజలలో సమాధి కలిగియుండుట, ఎంతో ఘనమైన విషయముగాను, ఉన్నతమైనదిగాను ఎంచదగును. ఆ సమాధికి విలువ, క్రీస్తుప్రభువు సమాధియే.

8) 'మరణము తప్ప ఏదియు విడదీయుటకు వీలులేదు'. తమ శరీరములో ప్రాణమున్నంతవరకు అత్త కోడలు వేరుగా జీవించుటకు వీలులేదు. శరీర సంబంధములు ఇహలోకము వరకే ఉండును గాని విశ్వాసి, క్రీస్తుతో ఈ జీవితములోను, రాబోవు జీవితములోను నిత్యము యేసుక్రీస్తు ప్రభువుతోనే ఉండును.

**9) రూతు తీర్మానము చేసికొనుట:-** మనమును అట్టి తీర్మానము కలిగియుండవలెను. మన తీర్మానము ధవళేశ్వరం ఆనకట్టవలె ఉండవలెను. ఎన్ని తుఫానులు వచ్చినా, వరదలు వచ్చినా కొట్టుకొనిపోకుండ ఉండవలెను. మొత్తముమీద గట్టి అమ్మాయి రూతు. బోధకులారా! మీ బోధ గట్టిదైతేనే మీ సంఘము గట్టిదైయుండును. ***నాలుగు డబ్బులు వస్తున్నాయని అనుకొంటే, మీ తీర్మానము గాలికి కొట్టుకొని పోయినట్లే.***

**10) రూతు సేవచేయుట:-** రూతు నయోమికి ఎదురు చెప్పక, విధేయురాలై పరిగె ఏరుకొని, అత్తగారియొక్క పోషణ భారమంతా భరించెను. దేనినిచూచి ఇంత ప్రేమ? తన అత్తగారిమీద కలిగిన గురినిబట్టి! గురిలేని సేవ ఫలితము కలుగజేయదని ఎరిగి, ఆమెవలె గురి కలిగిన సేవ చేయవలెను. ఓ పాదిరిగారూ! ఓ ఇవాంజిలిస్టుగారూ! నీవు సువార్త పని చేయుటలో నీ గురి ఏమిటి. నీ కుటుంబము పోషించుకొనుటయా? లేక యేసుక్రీస్తు ప్రభువుకు కీర్తి కలిగించుటయా?

**11) రూతు విశ్రాంతిననుభవించుట:-** దీనికొరకు ఆమె విమోచనకుని పాదములయొద్ద పరుండెను. ***నీవు ఎంత సేవచేసినను, ఆయన పాద సన్నిధిని లేనియెడల నీకు విశ్రాంతిలేదు.*** అక్కడికి చేరినవారిని ఆయన వట్టి చేతులతో పంపివేయడు. నీవు అనుభవించ గలిగినన్ని వరములతో ఆయన నిన్ను నింపివేయును.

**12) రూతు బహుమానమును అందుకొనుట:-** బోయజు ఆమెను వివాహమాడి లేమిని తీర్చెను. దేవుడు సంతానమునుకూడ ఆమెకు అనుగ్రహించెను. పేదరాలు స్వతంత్రురాలు అయినది. ఎలీమెలెకు కుటుంబము నాశనము కాకుండ నిలిచినది. రూతు అన్ని దీవెనలు అందుకొన్నది. **పెండ్లికుమార్తె అందుకొనని దీవెన భూలోకములో ఉండదు.** పెండ్లికుమారుడు తన వస్త్రమును మనమీద కప్పును. ఆ భాగ్యము ఈ పందిరిలో ఉన్నవారందరికి కలుగునుగాక!

**13) బోయజు రూతునుగూర్చి పలికిన మాటలు:-** ఈమె మోయాబు జనాంగమునకు సంబంధించినదైననూ, “నా కుమారీ! వేరే పొలములో ఏరుకొనుటకు వెళ్లవద్దు. నీ ఇష్టము వచ్చినట్లు కూర్చుకొనుము. నీ పెనిమిటి మరణమైన తరువాత నీవు నీ అత్తకు చేసినది నాకు తెలిసినది” అని బోయజు రూతుతో ప్రేమగా మాటలాడెను. వారు యూదులు, ఈమె అన్యురాలు గనుక బోయజు ఏలాగు ఉండవలెను? ఈమెను ఎందుకు ప్రేమించాలని వారన్నారు. ఎందుకంటే రూతులో ఉన్న గుణ లక్షణములనుబట్టి ఆమె కొరకు పనలు వదలిపెట్టుడని బోయజు ఆజ్ఞాపించాడు. ఈ ఇండియా దేశములో ఒక రూతు పుట్టినది, **అది బైబిలు మిషను. దొర, దాతలేని మిషను.** భూసంబంధ భాగ్యము మనకు లేదు, మనకంటె గొప్ప భాగ్యము ఎవ్వరికి లేదు. ఇశ్రాయేలీయులను ఒక పక్షముగా, రూతును ఒక పక్షముగా పెడితే రూతే గొప్పది. నయోమి వస్తు వస్తూ అన్ని పోగొట్టుకొంటే పోగొట్టుకుంది గాని ఒక గొప్ప చిన్నదాన్ని తీసికొచ్చినది. ఆలాగే దైవజనులు ఏమిలేనివాడైనను బైబిలు మిషను తీసికొని వచ్చినారు. నయోమి రూతును పోషించాలా? రూతు నయోమిని పోషించాలా? నయోమి చెప్పకపోయిన గాని రూతు పరిగె ఏరుటకు అడిగి వెళ్లినది. బైబిలుమిషను కొరకు మనము ఏమి చేస్తున్నాము? రూతు ఈ దేశములలోనికి వచ్చినది. ఆమె ***పరిగె ఏరుకొన్నాగాని ప్రభావముగలది.***

రూతు ఏలాగు వెళ్ళినదో ఆలాగే బైబిలుమిషను తాను వెళ్ళవలసిన చోటికి వెళ్ళును.

14) రూతు మోయాబు దేశములోఉంటే, ఆమె మంచి చెడ్డలు బైలుపడునా? ***అలాగే బైబిలుమిషను బయటకు వెళ్ళితేనే గాని గొప్పతనము బయలుపడదు. పరిగె ఏరిన ఆమె, పనలు కూర్చుకున్నది.*** అక్కడనుండి వృద్ధి అవ్వాలి. రూతు కల్గియుండిన దివ్యమైన లక్షణములు కలిగియుంటే మనముకూడ గొప్పవారము కాగలము. మన ప్రార్ధనమెట్లులో ఉన్న తీర్మానము రూతుకు తెలుసు. **ఇప్పుడు కనబడే కాలముకాదు. బైబిలుమిషను కనబడే కాలము ఒకటి వచ్చును.** రూతు, ఆ దేశములో ఉన్నప్పుడే తీర్మానము చేసినది. ఇక్కడకు వచ్చిన తరువాత విలువ కనబడినది. ఈ మిషను ఏ విషయములో గొప్పదో 23 విషయములు చెప్పాను. ఈ రూతుయొక్క సౌందర్యము ఏమంటే; ఆమె అత్తగారికి తెచ్చినది, అత్తగారికి పెట్టినది. పెట్టినది గొప్పదా? కలిగినది గొప్పదా? ఈమె పని గురిపెట్టి పనిచేయడము. మనము చేయకలిగిన పని మనము చేసిన యెడల, ఆయన చేయవలసిన పని ఆయన చేస్తారు. మనము ఎంతపని చేసినా ప్రతిఫలము దేవునిదే. **ఆయన మీ సేవకు సంపూర్ణమైన ప్రతిఫలము దయచేయునుగాక!** ఆమేన్.

# రూతు సమర్పణ

**తండ్రి: రూతు 1:16; కుమార: మత్తయి 19:23-30; పరి. ఎపె. 2:18-22.**

**రూతు హత్తుకొనియుండుట:-** 'పరిశుద్ధదేశ ప్రయాణీకురాలితో రూతు హత్తుకొని యున్నది. యెహోవాను సేవించేవారియొద్దకు ఈమె వెళ్ళుచున్నది. ఎక్కడైతే ఆదరణ దొరుకుచున్నదో అక్కడకు వెళ్లేవారిని ఆమె హత్తుకొనియున్నది. అట్లే భక్తులను హత్తుకొనియుంటే ఆ గుణములే మనకు దొరుకును. రూతమ్మ చరిత్రలో రెండు సంగతులు కనబడు

చున్నవి. మనము ఏమి తీర్మానము చేసికొనవలెనో ఆ తీర్మానము అనగా, 1) మళ్లి పోవుచున్న అత్తగారితో వెళ్లుట, 2) వెళ్లిపోవుచున్న అక్క గారితో (ఓర్పాతో) వెళ్ళకపోవుట. (ఎ) అన్యులదేశము వదలి వచ్చితిని, (బి) గనుక తిరిగి వెళ్ళను. ఈ రెంటిలో ఏది గొప్పది? దేనికదే గొప్ప. పాతదేశము విడువవలెను. పరిశుద్ధ మార్గమున వెళ్లవలెను. కొందరు అది విడువలేరు, గాని భక్తులతో ఉండవలెనని ఆశ. ఓర్ప ఎలుగెత్తి ఏడ్చినది. ముద్దు పెట్టుకొన్నది కాని వెళ్ళిపోయినది. పై రెండు మంచి పనులేగాని రూతు చేసిన పని చేయలేకపోయినది. ***అన్యులు కొన్ని అవలంభించగలరు గాని వారి మార్గము విడువలేక వెనుకకు తిరిగి వెళ్లెదరు.*** మీరు రోజూ మీటింగుకు రాగలరు! బోధ వినగలరు! కాని మీ అలవాటు మానరు. కనుక ఈ రెండు చేసి ప్రయోజనము లేదు. ఇదంతా ఊరు బయట కథ.

నయోమి తన కోడండ్రును రావద్దని బ్రతిమాలినదన్నమాట. అపుడు రూతు– 'నన్ను రావద్దని, విడిచిపెట్టమని అనవద్దు' అన్నది. ఆలాగే మీరు వెళ్ళి తిరిగిపోయి మీ పూజలు చేస్తే, పాదిరిగారు రేపటినుండి మీటింగుకు రావద్దనిన, మీరు వచ్చెదరా! మానెదరా! రూతు మానలేదు. 1) నీవు వెళ్ళుచోటికే వచ్చెదను, 2) నీవు నివసించు చోటనే నివసించెదను, 3) నీ జనమే నా జనము, 4) నీ దేవుడే నా దేవుడు, 5) నీవెక్కడ చనిపోతే నేను అక్కడ చనిపోయెదను, 6) ఎక్కడ పాతిపెట్టబడితే అక్కడ పాతిపెట్టబడెదను 7) మరణము తప్ప మరి ఏది నన్ను వేరుపరుపలేదు. ***అన్యులెవరైనా బోధకులదగ్గరకు వచ్చి, అటువంటి మాట అనగలరా? అనినను చేయగలరా?*** 8) హత్తుకొనియుండుట– ఇది క్రియ. 9) ఈ నిబంధనను, మధ్యనే వదలిన యెహోవా నాకు ఎంత కీడైనా చేయును గాక! అటువంటి గొప్ప మాట అనెను. పై 8 సంగతులకు 9వది ముద్ర. ఇక విప్పుటకు వీలులేదు. It is like a

postal seal on the stamps. (అది తపాలా బిళ్ళలపై వేయబడిన లక్క ముద్రవలె ఉన్నది). ఈ 9వ సంగతి దేవుని దగ్గరకే వెళ్ళినది. (అన్యులలో కొందరు అన్ని వదలుకొని వచ్చి, మాకు ఏమి జరిగినా ఫరవాలేదు, మేము వెనుకకు తిరిగిపోము. తిరిగిపోయిన దేవుడే మమ్మును శిక్షించునుగాక! అని అనెడివారున్నారు). తీర్మానము ప్రకారముగా రూతమ్మ వెళ్ళవలెను. వెళ్ళకపోతే ఇదంతా సున్నా. తీర్మానము అయిన తరువాత వెళ్ళి తీరవలెను. రూతమ్మలో ఉన్న గొప్ప స్థితి: 1) తీర్మానము 2) ముద్ర 3) వెళ్లడము. ఇట్టి తీర్మానము చేసినయెడల మీరు పై 9వంటి వారగుదురు. ఓర్పా వెళ్ళిపోయినది. ఓర్పా ఒక శోధకురాలు, అన్యురాలు. ఓర్పావల్ల రూతమ్మ ఆకర్షింపబడలేదు. ఎవరైనా క్రైస్తవులైతే, వారి బంధువులు ఏడ్చినా తిరిగి వెళ్లెదమనుకొందురు. అనగా వారి ఏడ్పువల్ల ఆకర్షింపబడుదురు. క్రైస్తవులైన వారిని ఇతర అన్యులు శపించెదరు. అట్లుకాక రూతమ్మ తనను తానే శపించుకొన్నది. తాను తప్పకుండా స్థిరముగానున్నది గనుక ఆ శాపము తగలదు. ఓర్పాకు ఇష్టమున్నది గానీ రాలేకపోయినది. అలాగే అన్యులకు క్రైస్తవమతములోనికి రావలెనని ఇష్టమేగానీ రాలేదు. ఉదా:- పిల్లవాడు చెట్టుమీద ఉన్న కోతిని రాయితో కొట్టినపుడు, ఆ కోతి తిరిగి పండుతో కొట్టగా, పిల్లవాడు ఆ పండు తీసికొని వెళ్ళినాడు. అలాగే అన్యులు శపించిన అది మనకు దీవెనగానే ఉండును.

**ప్రార్థన:-** దయగల తండ్రీ! ఆ నీ బిడ్డ ఊరిలోగాదు, గుడిలోకాదు దారిలోనే తీర్మానము చేసినది. అట్లే అందరు చేసికొనవలెను. పాడైన దేశమునుండి వజ్రమును లేపితివి. ఆమె వజ్రమై పరిశుద్ధ దేశమునకు వెళ్ళినది. అట్లు వీరిని చేయుమని త్వరగా రానైయున్న ప్రభువు నామమున వేడుకొనుచున్నాము. ఆమేన్.

# హన్నా చరిత్ర

**తండ్రి: 1సమూ. 1:11; కుమార: లూకా.2:22-24; పరి. గల. 4:1-5.**

రామా పట్టణమునకు సమీపమున షిలోహు అను పట్టణము కలదు. ఎల్కానా తన కుటుంబముతో దేవునికి ప్రార్థన చేయుటకు అక్కడకు వెళ్ళుచుండెడివాడు. ఆయన భార్య పేరు హన్నా. ఆమెకు పిల్లలు లేకపోవుటయే ఆమె దుఃఖము. ప్రతి కుటుంబములో విచారము కల్గించే వృత్తాంతము ఏదో ఒకటి ఉండి తీరును. ఇక్కడ భార్య, భర్తలకు గొప్ప మైత్రి ఉన్నదిగాని విచారము కలదు. వారికిగల విచారమునకు దేవుని సమ్మతి కలదు. దేవుని సెలవులేనిదే ఏమిరాదు. ఆయన కొన్ని సమయములలో కష్టములు రాకుండా చేయగలడు. అలాగే కొన్నిమార్లు కష్టములు రానిచ్చి వాటినుంచి తప్పించగలడు. కష్టకాలముకూడ మనకు ఒక గొప్ప కృపాకాలమే. ఎల్కానా అను దైవజనుడు తన భార్యను ఆదరించెను. ఈ రీతిగా విశ్వాసులు ఒకరినొకరు ఆదరించు కొనవలయును.

ఒకనాడు వారు షిలోహునకు కానుకలను తీసికొని వెళ్ళిరి. దేవుని సన్నిధికి వెళ్ళినపుడే మనిషికి పూర్ణమైన ఆదరణ దొరుకును. రెండు పనులమీద వారు షిలోహునకు వెళ్ళిరి. 1) యెహోవాకు మ్రొక్కుటకు, 2) బలి అర్పణ కొరకు అనగా కానుకను అర్పించుటకు. ప్రతివారు దేవాలయమునకు వెళ్ళినప్పుడు ఈ రెండు సంగతులు జ్ఞాపకముంచుకొనవలెను. (1) దేవుని ఆరాధించుట, (2) కానుకలు అర్పించుట. మనము కానుక ఎందుకు అర్పించవలెను? మనము సమస్తము దేవునివలన పొందుచున్నాము ***గనుక మనము అట్లు చేస్తే దేవునికి ఎంతో సంతోషము.*** దేవాలయమునకు కానుక తీసికొని వెళ్ళుటలో హన్నాకు పూర్ణ సంతోషము కలదు. మనకు ఎన్ని కష్టములున్ననూ,

విచారములున్ననూ దేవాలయమునకు తప్పక పోవాలి. దేవాలయములో 1) సంతోషము 2) ఆదరణ దొరుకును.

షిలోహులో గొప్ప దేవాలయము లేదుగాని అది ఆరాధన స్థలము. అచ్చట ఏలీ అను యాజకుడు గలడు. ఆయనకు ఇద్దరు కుమారులు కలరు. కీర్తన 23లో ఉన్నట్లు ఏలీ నిత్యము దేవాలయములో నివసించెడివాడు. హన్నా ఆ దేవాలయములో తన హృదయములోనున్న విషయములన్నీ దేవుని సన్నిధిలో కుమ్మరించుకొనుచుండెను. దేవునికి మాత్రము చెప్పుకొనుచుండెను. పెదవులు మాత్రం ఆడించుచుండెను. ఏలీ ఆమెను తప్పు అర్థము చేసికొనెను. త్రాగివచ్చినది అనుకొనెను. అది మన కాలములో కూడా కనబడుచున్నది. ఒక ప్రార్థనాపరురాలు పలువురిని గూర్చి ప్రార్థించునపుడు కొందరు తప్పు అర్థము చేసికొనవచ్చును. అప్పుడు మనము నిరాశపడరాదు.

హన్నా- 'సైన్యాములకధిపతియును, దేవుడునగు యెహోవా! 1) నన్ను మరువవద్దు, 2) జ్ఞాపకము తెచ్చుకొనుము. 3) నా శ్రమను చూడుము, 4) నాకు ఒక కుమారుని దయచేసిన యెడల నీ సేవకు అతనిని అప్పగించెదను' అని ప్రార్థించెను. తన విషయములన్ని చెప్పుకొనుటకు ప్రతి విశ్వాసికి దేవుడు గడువులు ఇచ్చును. ఆమె దేవుని సన్నిధిలో తన హృదయమును కుమ్మరించినది. ఆమెకు ఇప్పుడు గొప్ప సంతోషముకలదు. అయితే, తన మనవి తన ప్రార్థన నెరవేరునని ఆమెకు నిశ్చయత తెలియదు. ఏలీ ఆమె దగ్గరనుండి సంగతి విన్న తరువాత, ఆయన చెప్పినది ఏమనగా 'నీకు క్షేమము కలుగునుగాక! నీవు వెళ్ళుము. నీవు చేసికొనిన మనవిని ఆయన దయచేయును'. ఈ వర్తమానము ఏలీకి దేవునియొద్దనుండి వచ్చెను.

మనము ప్రార్థన ముగించిన తరువాత, ఏలీ చెప్పిన ఈ ఆదరణగల మాటలు జ్ఞాపకము తెచ్చుకొంటే, ప్రతి ప్రార్థనాపరునికి

సంతోషము కలుగును. వాగ్ధానమును ఆమె చెవినిపెట్టుకొని సంతోషముతో వెళ్ళిపోయెను. అట్లే ఆమెకు ఒక కుమారుడు కలిగెను. సమూయేలు అని పేరు ఆమె అతనికి ఎందుకు పెట్టినది? సమూయేలు అనగా యెహోవా నా ప్రార్థన ఆలకించెను.

ఎల్కానా కుటుంబములో గొప్ప ఐక్యత గలదు. పాలు మాన్పించువరకు నేను షిలోహు రాను అని హన్నా చెప్పినపుడు, ఎల్కానా అడ్డు చెప్పక దేవుడు తన వాక్యమును స్థిరపరచును గాక! అనెను. కుమారుడు పుట్టుట అనేది నెరవేరినది. ఇంక సేవకు అర్పించుట అనేది నెరవేరవలెను. **ఆమె తన కుమారుని దేవుని కొరకు పెంచెను.** తమ సొంత మేలు కొరకు గాక, తల్లులు తమ బిడ్డలను దేవుని సేవ కొరకు పెంచవలెను. గవర్నమెంటు పని అయితే, దేశ సేవ నమ్మకముగా చేయవలెను. వారి కుటుంబములో ప్రతి విషయములోను భార్యభర్తలు ఏకీభవించిరి. కుమారుని షిలోహులోనున్న దేవుని మందిరములో అప్పగించి వారు ఇంటికి తిరిగివెళ్ళిరి. 'విచార సమయములో కలిగిన బిడ్డలవల్ల సంతోషము ఉండదు. ఆ పిల్లలు వర్ధిల్లరు' అని శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు గాని సమూయేలూకు గొప్ప సంతోషము కలిగెను.

1. దేవుడు ఒక కష్టకాలము రానిచ్చెను (అది కృపాకాలమే).
2. అందువలన ఆత్మ కుమ్మరించి ప్రార్థన చేసెను
3. వాగ్ధానకాలము. 4. నెరవేర్పుకాలము 5. సేవచేసే కాలము.

***ప్రార్థనాపరులందరు తమ కష్టములను ప్రార్థనద్వారా నెరవేర్చుకొనవలెను, సేవచేయవలెను.*** తన కుమారుని మరచిపోయి, దేవునిమాత్రము జ్ఞాపకముంచుకొనే కాలము ఆమెకు ఇంకముందుకు వచ్చెను. 10మంది కుమారులకంటే ఎల్కానా ఎక్కువ. 10 మంది కుమార్లకంటె సమూయేలు ఎక్కువ. అలాగే మనకు 10 సంగతులు

కంటే రాకడ సంగతి ఎక్కువ. అందరి కుమారుల కంటే దేవుని కుమారుడైన క్రీస్తుప్రభువు మనకు ఎక్కువ గనుక అందరము రాకడ కొరకు సిద్ధపడి కనిపెట్టవలెను, ఆ నిరీక్షణ కలిగియుండవలెను. అట్టి స్థితి త్వరగా వచ్చుచున్న ప్రభువు ఏకీభవించినవారికి దయచేయును గాక!

# హన్నా స్తుతి

**తండ్రి: 1సమూ. 2:1-10; కుమార: లూకా 1:42-55; పరి. 4:21-28**

హన్నా అను ఆమెకు ప్రార్థనాపూర్వకముగా కుమారుడు కలిగినప్పుడు తండ్రిని స్తుతించెను. అవి సాధారణమైన మాటలే. సాధారణముగా భక్తితో ఇతరులు చేయు స్తుతి అంతా ఒకేలాగునే యుండును. ఈ స్తుతి 3 భాగములు.

**1) భాగ్యముల వర్ణన:-** ఇందు తాను పొందిన భాగ్యములను బట్టి దేవుని స్తుతించెను. దేవానందము, దేవబలము, దేవరక్షణ, రక్షణానందము, స్వాతిశయము.

**2) దైవలక్షణ వర్ణన:-** ఇందు దేవుని లక్షణములు కనిపెట్టి స్తుతించెను. పరిశుద్ధుడు, వేరొకరులేరు, ఆశ్రయదుర్గము, అనంతజ్ఞాని, క్రియా పరీక్షకుడు.

**3) దైవలక్షణక్రియ వర్ణన:-** అనగా బహిరంగముగా తండ్రిచేసిన క్రియలను బట్టి స్తుతించెను. సజీవులు+మృతులు, పాతాళము + అందునుండి రప్పించుట, దారిద్ర్యము + ఐశ్వర్యము, కృంగదీయుట + లేవనెత్తుట అనగా మంటినుండి లేవనెత్తుట. ఎ) అధికారులతో కూర్చుండబెట్టుట. బి) పెంటనుండి లేవనెత్తుట, భూస్తంభములు దైవవశము, లోకమును వాటిమీద ఆయన నిలిపి

యున్నాడు. ఆయన తన భక్తులను కాపాడును, నియమిత రాజుకు బలము, అభిషిక్తునికి అధికబలము దయచేయును.

**4) శత్రుగతి వర్ణన:-** ఇందు శత్రువులకు దేవుడు చేసిన కార్యములనుబట్టి స్తుతించెను. నోటిమాటరాదు, విలుకాండ్రు ఓడుదురు. అన్నమున్ననూ, కూలికిపోవుదురు, పిల్ల తల్లి కృశించును, దుర్జనులు చీకటిలో మాటుమణుగుదురు.

**5) సజ్జనులు:-** వీరికి ఆయన చేసిన క్రియలనుబట్టిస్తుతించెను. గొడ్రాలు కనును, ఆకలితీరును, బలము ధరించుదురు. దేవుని లక్షణములు తలంచుకొనుట; ఆయన చేసిన ఉపకారములనుబట్టి హన్నా దేవుని స్తుతించెను.

ప్రార్థన శరీర సంబంధమైనది కాని ఆమె స్తుతి, ఆత్మ జీవితములోనికి వెళ్ళినది. మన హృదయములో ఒకానొకప్పుడు చాలా ప్రార్థనలుండవచ్చును. అవన్నియు చేయలేము. అట్లే స్తుతి విషయములు కూడా హన్నావలె ఒక్కసారే మనము చేయలేము. మనకు ఏవి వ్యతిరేకముగా ఉన్నవో అవన్ని దేవుడు పరిహారము చేయగలడు. హన్నాకు తీరని కొరత ఏమిటంటే పిల్లలు లేకపోవుట. అందుకై ఆమె 1) ఏడ్చుట, 2) బహుగా ఏడ్చుట, 3) బహు దుఃఖాక్రాంతురాలై, మనోదుఃఖముతో, 4) యెహోవా సన్నిధిలో మనో వేదనతో ప్రార్థన చేయుచున్నది. దేవుని సన్నిధియందు తన హృదయమును కుమ్మరించినది. **మనము రెండవ రాకడకు వెళ్లుటకు హన్నాకంటే ఎక్కువ ప్రార్థన చేయవలెను.**

**1) హన్నా ప్రార్థనయొక్క లక్షణములు:-** హన్నా ప్రార్థన ప్రకృతి సంబంధమైనను, ఆత్మ సంబంధమైన గొప్ప స్తుతి చేసెను. మనము చేయు ప్రార్థన పరలోకమునకు వెళ్ళుటకు మనలను సిద్ధపరచునది. 2. హన్నా సన్నిధిలో ఉన్నది, సన్నిధి కలిగియున్నది. 3. హన్నా మనసును ఖాళీగా పెట్టలేదు. మనమును మన మనసును ఖాళీగా ఉంచరాదు.

4. కొరత తీరుట అనగా మనము ప్రార్థించినపుడు మన అవసరతలు తీరును. సన్నిధి కలిగియుండుట అనగా ప్రతిరోజు ప్రార్థనలో దేవుని ఎదుట హృదయమును కుమ్మరించుట. ఉదా:- 'విరిగి నలిగిన హృదయము దేవునికిష్టము' అని వ్రాయబడినట్లు హన్నా చేసిన ప్రార్థన హన్నాను దేవునికి ఇష్టురాలిగా చేసింది. హన్నా పెదవులు తడబడుచున్నవి గాని ఆమె హృదయము కుమ్మరించబడుచున్నది హన్నా చేసిన ప్రార్థన పలుకులు పలుకు ఏలీకి వినబడవలెను గాని, దేవునికి వినబడినవి.

**దైవలక్షణ వర్ణన:-** తన ప్రార్థన నెరవేరిన పిదప హన్నా, దేవుని లక్షణములెత్తి ఆయనను స్తుతించెను. పరిశుద్ధుడు, వేరొక దేవుడు లేడు, ఆశ్రయదుర్గము, అనంతజ్ఞాని, క్రియా పరీక్షకుడు. నిజముగా దేవుడు పక్షపాతి అని హన్నా అనవలెను. ఎందుకంటే తన ఇంటిలో నున్న పెనిన్నాకు సంతానము కలదు గాని హన్నాకులేదు. గానీ హన్నా ఆలాగు అనలేదు. దేవుడు పక్షపాతికాడని అందరిలో నిలువబడి చెప్పెను. అట్లే హన్నా అనుభవములోనికి వచ్చిన తర్వాత దేవుడు పరిశుద్ధుడని చెప్పెను. ఆ విషయము ఆమె జ్ఞానమునము తెలుసును గాని హృదయమునకు తెలియదు. హృదయములకు తెలిసిన తరువాత అనుభవములోనికి వచ్చును.

**ఆశ్రయదుర్గము:-** హన్నా గొడ్రాలైయున్నపుడు దేవాలయమునకు వెళ్ళి దేవుని ఆశ్రయించినపుడు ఆమెకు సంతోషము కల్గెను. దేవుని ఆశ్రయించుటచే ఫలితముకూడ కలిగెను. అందుచే హృదయములోనుండి అనుభవములోనికి వచ్చిన సంతోషమునుబట్టి యెహోవావంటి ఆశ్రయ దుర్గము లేదని చెప్పెను. అనుభవములోనికివస్తే గాని దేవుని వాక్యకాంతి, అందులోని విలువ కనబడదు. దావీదుకు ప్రభువు కోట, దుర్గము. ఇవి అన్నీ బహిరంగ ఆశ్రయములు. ***హన్నాకైతే ఆమె హృదయమునందు దేవుడే ఆశ్రయము.***

**అనంతజ్ఞాని:-** దేవుడు మొదట పిల్లలను ఇవ్వకపోవుటకు కారణము ఆయనయొక్క అనంతజ్ఞానమే, తర్వాత ఇచ్చుట కూడ ఆ అనంతజ్ఞాని పనియే. ఏది ఎట్లుచేయవలెనో ఆయనకు తెలుసును. తండ్రి పని జ్ఞానయుక్తమైన పని. హన్నాకు ముందే పిల్లలున్న యెడల అంత ప్రార్థన చేయదు. ***అంత ప్రార్థన చేయకపోయిన సమూయేలు అంత భక్తుడుకాడు.*** తండ్రిని రెండు విషయములలో మెచ్చుకొనవలెను. 1) తండ్రి మన విషయములో జరుగనిచ్చిన పని చూచి మెచ్చుకొనవలెను. 2) మన విషయములో జరుగబోవనిచ్చు పని విషయమై మెచ్చుకొనవలెను.

**క్రియాపరీక్షకుడు:-** ఇంటి దగ్గరనున్నపెనిన్నా తన్ను అనిన మాటలన్నిటిని తండ్రి విని, ఆమెకు తీర్పుతీర్చి హన్నాకు ఉపకారము చేసెను. ఆయన అన్ని క్రియలను పరీక్షచేయును. మానవుడు ఏమి చేసిననూ, ఆయన జ్ఞాన నేత్రమునకు మరుగుకానేరదు.

**సర్వాధికారి:-** అపవాది పాపము చేయించుచున్నాడు. అందుచేత దరిద్రత వచ్చెను. ఇది అపవాది పని అనకుండా, దరిద్రులను, ఐశ్వర్యవంతులను కలుగజేయువాడు యెహోవాయే అని హన్నా పలికినట్లు వాక్యములో వ్రాయబడియున్నది. ఇది అపవాదికి ఒక పాఠము. మనముకూడా ఒక పాఠము నేర్చుకొనవలెను. మనము అపవాదిని ఎదిరించుటకు ఈ వాక్యము వ్రాయబడినది. దారిద్ర్యము పాపమువలన వచ్చును. అంతేకాదు, అజాగ్రత్త, అజ్ఞానము, పాటుపడనందువలన కూడా దారిద్ర్యము వచ్చును. దేవుని సెలవు లేకుండా మనము కారణమైనను సరే, అపవాది కారణమైనను సరే దారిద్ర్యమురాదు. తండ్రికూడా పేదరికము అనుభవించెను. పాపముయొక్క ఫలితము ఆయనకూడా అనుభవింపవలసి వచ్చెను. పాపము నిమిత్తము మనము దరిద్రులము. అయితే, మనకు ఐశ్వర్యము

రావలెనని మన నిమిత్తము ఆయన దరిద్రుడాయెను. ఇది మహిమ మాదిరి. పేదరికము, దరిద్రత, కరవు వీటిలో వేటిలోనున్నను విశ్వాసి ప్రభువును స్తుతించవలెను. ఇది ఎంతో మహిమగల స్థితి. తండ్రి కొందరిని ఆరోగ్యవంతులుగాను, కొందరిని అనారోగ్యవంతులుగాను, మరి కొందరిని జ్ఞానవంతులనుగాను, ఇంకా కొందరిని వీటికి వ్యతిరేకముగాను చేయుచున్నాడు. ఈలాగు ఎందుకు చేయవలెను? అని అడుగునది అజ్ఞాన ప్రశ్న. అది తండ్రికి తెలుసును. మానవుడు దేవుని జ్ఞానమును గ్రహించలేడు. మానవుని జ్ఞానము తండ్రియొక్క జ్ఞానము ఎదుట వెర్రితనమైనట్టు అవిశ్వాసి జ్ఞానము, విశ్వాసి జ్ఞానము ఎదుట వెర్రితనమైయుండును. విశ్వాసియొక్క జ్ఞానము దేవుని జ్ఞానమును గ్రహించును.

మనలను వెయ్యేండ్ల పరిపాలనలో ధనవంతులుగాను, మరణమైన వెనుక పరలోకములో ధనవంతులుగాను చేయుటకు ఆయన 33 1/2 సం॥లు బీదవాడుగా నుండెను. ఆత్మ జీవనములో పేదరికము కలదు. దీనివలన కీడు కలుగును. క్రుంగజేయువాడును, లేవనెత్తువాడు ఆయనే. ఎందుకు క్రుంగజేయవలెను? లేవనెత్తుటకే. క్రుంగజేయుట కూడా దేవుని ప్రేమయే. క్రుంగచేయుట అనగా బాగుగా నిలువబడిన వానిని పడగొట్టుట. ఇది పైకి కనబడదు గాని విశ్వాసి ఇందులోని మేలు గ్రహించును. విశ్వాసియొక్క జ్ఞానము తండ్రినుండి కలిగినది. బాగుగానున్న వానిని కృంగునట్లు చేసిన తర్వాత వానిని దేవుడు లేవదీయును. ఇందుకు దేవుని వాక్యములో అనేక వజ్ర వాక్యములున్నవి. వాటిని పరిశుద్ధాత్మ జ్ఞాపకము చేయును. ఈ వాక్యములో మానవులను గూర్చి దుస్థితినిగూర్చి ఉన్నది. యేసు ప్రభువునకు రాజు అను పేరు పుట్టినరోజునే ఆరంభమాయెను. కాని ఆయన ఎక్కడను రాజు కాలేదు గాని వెయ్యేండ్లలో రాజగును. అయిననూ, ఈ మానవ చరిత్రలో సర్వాధికారి ఆయనే.

ప్రార్థన:- ప్రేమగల తండ్రీ! నీవు మహాపరిశుద్ధుడవు. ఇది మా అనుభవములోనికి తీసికొని రమ్ము. మా దేవా! నీవు ఆశ్రయ దుర్గము, అనంత జ్ఞానివి, క్రియాపరీక్షకుడవు, సర్వాధికారివి. ఇవి కూడా మా అనుభవములోనికి తీసికొని రండి. నీకు మరుగైనదేదియు లేదు గాన మేము నీకు భయపడి, కార్యములు చేయునట్లు సహాయము చేయుము. మేము త్వరగా సిద్ధపడునట్లు చేయుము. హన్నావలె స్తుతించే అనుభవములోనికి తీసికొని రమ్ము. ఈ ప్రార్థన త్వరగా రానైయున్న యేసు నామమున వేడుకొనుచున్నాము ఆమేన్.

# హన్నా అనుభవము

**తండ్రి: 1సమూ. 1:6-20న కుమార: లూకా 1:49-55; పరి. 11:16-23.**

దేవునియొక్క లక్షణములు హన్నా అనుభవములోనికి వచ్చినందున, ఆమె దేవుని గుణములను తీసికొని ఆయనను స్తుతించెను.

హన్నా, తనకు పిల్లలు లేకపోవుటనుబట్టియు, పెనిన్నాకు పిల్లలుండుటను బట్టియు దేవుడు పక్షపాతి అని అనుకొనుటకు సందు గలదు. నిజముగా దేవుడు పక్షపాతియైతే ఆయన పరిశుద్ధుడుగా నుండలేడు. హన్నా చేసిన స్తుతి మరియమ్మ చేసిన స్తుతివంటిదే. సాధారణముగా భక్తిపరుల స్తుతి ఒక రీతిగానే యుండును. పెనిన్నా హన్నా వీరిద్దరి యెడల ఆయన సంకల్పన ఆయన దృష్టికి యోగ్యమైనది. పౌలు, పేతురు జీవితములోకూడా ఇట్టి అనుభవములున్నవి. అన్యులు ఆత్మను పొందడము, భాషలు మాట్లాడడము (పేతురు అనుకొనని సంగతి); అందుకు పేతురు ఆశ్చర్యపడి సంతోషించినాడు. ఆయన అనుభవము దేవుడు పక్షపాతికాడు. యూదులతో సమానముగా అన్యులకును అన్ని వరములిస్తాడు. పేతురుకు గొప్ప సంతోషము. ఎప్పుడు? అనుభవములోనికి వచ్చినప్పుడు! అలాగే హన్నాకు కుమారులు

లేకపోవడము అనే బాధలో అనుభవము వచ్చినప్పుడు ఆమె 'దేవుడు పరిశుద్ధుడు' అని స్తుతించగల్గినది. అది తన జ్ఞానమునకు తెలుసును గాని హృదయమునకు తెలియదు. హృదయమునకు తెలిసినప్పుడు అనుభవములోనికి వస్తుంది. తన కుమారుని పోగొట్టుకొనిన ఒక స్త్రీ- 'అయ్యా! మా జీవరత్నంను దేవుడు తీసికొన్నాడు. దేవుడెంత దొడ్డవాడు! మంచి మాటలు, ఆదరణ మాటలు చెప్పిపోయినాడని' అనుట ఆమెకు అనుభవములోనికి వచ్చినది గనుక సంతోషించినది.

ఆలాగే మనకుకూడా దేవుడు అనేక విషయములలో అనుభవము కలుగజేయుచున్నాడు. ఇట్టి కృప కొరకుకూడా మనము ఎదురుచూడవలెను. హన్నా ఎప్పుడు ఎక్కువుగా సంతోషించినది? కుమారుడు కలిగినప్పుడు సంతోషించినదా! లేక దేవునిని ఆశ్రయించినపుడు సంతోషించినదా! దేవునిని ఎప్పుడు ఆశ్రయించినదో అప్పుడే ఆమెకు ఎక్కువ ఆదరణ కలిగినది గనుక ఆమె ఆయనను ఆశ్రయదుర్గమని అనగలిగినది. ఆయన అనంతజ్ఞాని. కారణమేమి? ఆయన చేసే పనులు ఆరంభములో అంత జ్ఞానము గలవిగా కనబడవు కొంతకాలము పిల్లల ననుగ్రహించకపోవడము ఆయన జ్ఞానమేయని హన్నా తెలిసికొనినది. దేవుని సృష్టి కార్యములన్ని జ్ఞానయుక్తములైనవి. మొదట మనుష్యుని చేయలేదు (ముఖ్యుడు) కాని అతనికి అవసరమైన వాటిని ముందు చేసినాడు.

దేవుడు యూదులను ఏర్పాటు చేసికొని వారిచే తన ఆజ్ఞలు అభ్యసింపజేసి, వారు విధేయులైనప్పుడు అన్యులను పిలిచి, వారిని వీరిని కలిపివేసినాడు. తర్ఫీదు అయినవారిద్వారా, ఇతరులనుకూడా తనదరికి తీసికొని రావడానికే దేవుడు ఆలోచించెను. **యూదులను ఏర్పర్చుకొని తర్ఫీదు ఇవ్వడము అన్యులను చేర్చుకొనుటకే.** హన్నా విషయములోకూడా

ఇట్టి ఆలోచనయే దేవునికున్నది. కొంతకాలము పిల్లలు లేకుండాచేసి, ఆ తరువాత తన చేత ప్రార్థనలు చేయించి, అటు తరువాత పిల్లలను, ఇవ్వడము ఆయన జ్ఞానమే. మన కష్టకాలమందు దానిని తొలగించకపోవడము ఆయన జ్ఞానమే, తొలగించడము ఆయన జ్ఞానమే. ఆయన అనంతజ్ఞాని, అనాది పరిశుద్ధుడు, అనంత పరిశుద్ధుడు.

**ఉదా:-** వడ్రంగి తన చేతిలోని కఱ్ఱను చెక్కి చిత్రికపట్టి, నగిషీపెట్టుట; దానికి సుందరమైన రూపు ఏర్పర్చుటకేగదా! ఈలాగు మలచునపుడు అతడు తన చేతిలోని కఱ్ఱనుచూచి జాలిపడును. ఎందుకనగా కఱ్ఱకు బాధే అయినా, తరువాత కాలమునకు అది సుందరమైన సృష్టిగా మార్చబడును. కఱ్ఱమీద వడ్రంగి జాలలిపడునట్లు ఆయన కార్యములుండును. గనుక మనము వీటన్నిటిని అనుభవము లోనికి తెచ్చుకొనవలెను. ఒక టీచరు భూమి గుండ్రముగా నున్నదని పిల్లలకు బోధించి, అది నేను నమ్మలేననెను. ఆ టీచరు సముద్ర తీరమునకు వెళ్ళి ఓడను గమనించితేనే గాని ఆ విషయము ఆయనకు బోధపడదు. దేవుడు క్రియాపరీక్షకుడు, ఆయన జ్ఞానమును బట్టి ఆయన పరీక్షకుడని హన్నా తెలిసికొనినది. ఎవరెవరు తన్ను హింసించినారో ఆయన పరీక్షించి, తగు ఫలితము ఇచ్చినాడని తెలిసికొనినది. ***ఆయన కార్యములు జ్ఞానయుక్తమని ఒప్పుకొనినప్పుడే మనకు ఆనందము, సమాధానము కలుగును.*** ఆయన వచ్చేటప్పుడే వస్తాడు. ఆయన జ్ఞాని గనుక ఎపుడు రావలెనో ఆయన తెలుసును. కంసాలి బంగారమును నిప్పులోవేసి, బాగుగా కాల్చితీయును. ప్రభువు ఎప్పుడు రావలెనో ఆయనకు తెలియును. ఆయన వచ్చినపుడు సరిగా సిద్ధపడి ఎగిరివెళ్ళు ధన్యత ఇక్కడ చేరినవారికి ఆయన దయచేయునుగాక! ఆమేన్.

# ఎస్తేరు చరిత్ర

**తండ్రి: ఎస్తేరు 4:13-14; కుమార: మత్తయి 25:1-13; పరి. హెబ్రీ. 11:30-35**

**ప్రార్థన:-** తండ్రీ! హిందువులకు వారి నిష్టపోలేదు. ఆలాగే యూదులకును వారినిష్ట పోలేదు. ఆలాగే బైబిలు మిషనువారుకూడ తమ నిష్టను కాపాడుకొనేటట్టు చేయము. నీవే (అయ్యగారిని) లూథరు మిషనునుండి తీసికొని వచ్చావు. బైబిలు మిషను స్థాపించినావు. ఎక్కడకు నడిపించినా నీవేకదా. అలాగే నీవు బైలుపర్చిన ***ఈ బైబిలుమిషనువారు అందరు తమ నిష్టను కాపాడుకొనునట్లు కృప దయచేయుము.*** మిషనుకాదుగాని, విశ్వాసముగలవారు మోక్షమును సంపాదించుకొనగలరు. లూథరు మిషనులో పట్టుదలగల నన్నే నీవు పట్టుకొని ఈ మిషనును తీసికొని వచ్చినావు. లూథరన్ మిషను తల్లి మిషను అయితే బైబిలు మిషను తండ్రి మిషను. ***ఏ మతమువారైనను, ఏ మిషను వారైననూ సరే ఈ మిషనుకు రావలసియున్నది.*** ఇతర మతములను, ఇతర మిషనులను, ఇతర మనుష్యులను దూషించుట మా పనికాదు. గాని అందరి క్షేమముకోరుటయే మా పనియైయున్నది. అతిశయము, గర్వము మాలో ప్రవేశించకుండా సహాయము దయచేయుము. మమ్మును బట్టి మేము అతిశయించకుండునట్లును, నిన్ను బట్టి అతిశయించే కృపను దయచేయుమని వేడుకొంటున్నాము. ఆమేన్.

వష్తి ఇతర క్రైస్తవులకు ముంగుర్తుగానుండెను. ఎస్తేరు అనగా తూర్పు నక్షత్రము ఈమె క్రీస్తుయొక్క పెండ్లికుమార్తె సంఘమునకు ముంగుర్తుగానుండెను. మొదటి గుంపులోని కన్యకలు చేసిన పొరపాటు మిక్కిలి స్వల్పమే. అనగా చాలినంత నూనె తెచ్చుకొనలేదు. అందుచేత వారు పెండ్లికుమార్తె సంఘములోనికి చేరలేదు. ఒక చిన్న పొరపాటు ఉన్నను పెండ్లికుమార్తె సంఘములోనికి చేరలేరు ఈ గ్రంథములోని

భాగములు: 1) అహష్వేరోషు చేసిన విందు, 2) ఎస్తేరు చేసిన విందు, 3) పూరీము పండుగ విందు.

ఎస్తేరు కాలములో యూదులనందరిని చంపివేయవలెననే కుట్రాలోచన జరిగెను. అన్యులు ఈ సంగతి ఆలోచించిరి. యూదులు ఉపవాసముండి ప్రార్థిస్తే అపాయము రాకమానెను. ఎస్తేరును అన్యరాజైన అహష్వేరోషు వివాహము చేసుకొనెను. అప్పటికి ఎస్తేరు వంశము బానిసవంశము అనగా చెరలో ఉన్న యూదులవంశము.

1. అహష్వేరోషు రాజు గనుకను, ఎస్తేరు బానిస వంశములోని స్త్రీ గనుకను, ఈ వివాహము సమకూడుట అసాధ్యము. అయిననూ ఈ కార్యము జరుగుటనుబట్టి ఇది దైవ సంకల్పమైయున్నదని గ్రహించవలెను. పిశాచియొక్క ఉద్దేశములో, యూదులలో జన్మించనై యున్న లోకరక్షకుని పుట్టకుండా చేయవలెనని ఉన్నది. రాజు మంత్రియగు హామానుయొక్క ఉద్దేశ ప్రకారము, రాజు ఆలాగు యూదులను నాశనము చేయవలెనని ఆజ్ఞాపించియుండెను. అట్లయితే ఒక దినమున రాజుకు ఏమి తోచక, పూర్వపు రికార్డు తిరిగిచూడగా తన ప్రాణమును మొర్దెకై తప్పించినట్లు ఉండెను. అందుకు బహుమానము ఏమియు ఇయ్యబడలేదు. రాజు మొదట సంతకము పెట్టెను. ఇప్పుడు రాజు ఆజ్ఞ తలక్రిందులాయెను. తర్వాత అదే రాజాజ్ఞను బట్టి యూదులే ఇతరులను చంపిరి. అందుకు యూదులు సంతోషించి బహుమానమును పంపుకొనిరి.

**2. పూరీము పండుగ:–** దేవుడు ఇశ్రాయేలీయులును నాశనము నుండి తప్పించినందుకు యూదులు నేటివరకు ఈ పండుగ చేయుచున్నారు. ఒకరికొకరు బహుమానములను పంపించి పండుగగా చేసికొనుచున్నారు. దీనివల్లనే మనమునూ క్రిస్టమస్ దినమున బహుమానములు పంపించుకొను ఆచారము కలిగినది.

**3. ఎస్తేరు గ్రంథములోని భాగముల వివరములు:-** 1) వష్తియగు రాణియొక్క కథ; ఆమె నిరాకరింపబడుట. 2) ఎస్తేరు రాణియగుట. 3) హామానుయొక్క కుట్రాలోచన. 4) ఎస్తేరుయొక్క ధైర్యమువల్ల యూదులకు విమోచన కలుగుట. 5) యూదులు పగదీర్చుకొనుట. 6) పూరీము పండుగ. 7) మొర్దెకై గవర్నమెంటులో ప్రధానమంత్రి ఉద్యోగము చేయుట. ఈయన తన జనులయొక్క క్షేమమును విచారించుటనుబట్టి ప్రసిద్ధికెక్కిన వాడాయెను. ధైర్యమువలన తన జనమునకు గొప్ప ఉపకారము చేసినవారిలో మొదటివాడు యెహోషువ, తరువాతి ప్రముఖుడు మొర్దెకై.

**ఎస్తేరు గ్రంథముయొక్క విమర్శ:-** (1) ఇది లోకచరిత్ర కాబట్టి ఇది బైబిలులో నుండకూడదు అనియు, (2) ఈ పుస్తకముయొక్క సంగతి క్రొత్త నిబంధనలో ఎక్కడాలేదు గనుక బైబిలులో చేర్చకూడదనియు, (3) రాజు పేరు 187 సార్లు ఉన్నది గాని దేవుని పేరు ఒక్క పర్యాయమైన లేదు గనుక ఈ గ్రంథమును బైబిలులో చేర్చకూడదనియు పండితులు వాదించిరి. ద్వితీ. 31:18 చూడగా యూదులు ఇప్పుడు పారశీక దేశములో తమ అపరాధ ఫలమును అనుభవించుచున్నారు గనుక దేవుడు తన ముఖమును మరుగుచేసికొన్నాడు అనగా చాటు చేసుకున్నాడు అని గ్రహించుకొనవచ్చును. అనగా ఈ గ్రంథ చరిత్రలో దేవుడు లేడని కాదుగాని, ఎవరికి కనబడకుండా చాటున ఉండి, కథలు ఏలాగున నడుచుచున్నావో చూచుచున్నాడని అర్థము. మరియు యూదులకు గాని, కుట్రస్వాములకు గాని తెలియకుండా దేవుడు తన జనాంగమును ఏలాగు భద్రపరుచున్నాడో ఈ గ్రంథములో తెలుస్తున్నది. బైబిలులోని ఏ గ్రంథములోను ఈలాగు లేదు. దేవుడు తన జనాంగమును భద్రము చేయువాడైయున్నాడని ఈ వాక్యములలో నున్నది (యూదా పత్రిక 1వ, ప్రకటన 1:1). అంధకారముయొక్క శక్తులన్నియు,

పటాలములన్నియు, పాతాళలోకము యొక్క ప్రతినిధులందరును ఏకీభవించినను, దేవుని జనాంగమును ఏమియు చేయలేరు అని దేవుని సేవకులు మరచిపోకూడదు, అధైర్యపడకూడదు.

1) *అంధకార శక్తులనగా "త్రోసివేసినను, ఎదిరించినను, ప్రార్థనలో ఎదిరించినను మేమెక్కడ కదులుదుము!" అనే పాపపు బుద్ధులే అంధకారశక్తులైయున్నవి.* 2) అపవాది పటాలమనగా దయ్యములన్నియు వచ్చును. 3) పాతాళముయొక్క ప్రతినిధులు ఎవరనగా, దేవుని జనాంగమును నాశనము చేయుటకును, దేవుని రాజ్యమును ఆటంకపరచుటకును; "ఓ అపవాదీ! నీవుగాని, నీ దూతలైన పిశాచములు గాని రానక్కరలేదు" మేమున్నాము అని చెప్పే మనుష్యులే పాతాళము యొక్క ప్రతినిధులైయున్నారు. ఈ సంగతి ఎస్తేరు గ్రంథములోనికి వెళ్లి ఒప్పుకొనే మాటయైయున్నది. మనమును ఆలాగే చెప్పుకొనవలెను అనగా 'పరమ దేవుండే నా పక్షమైయుండగా నరుడేమి చేయగలడు!' అనే కీర్తన పాడుకొనవలెను.

9. యూదులు ఎస్తేరు గ్రంథమునుగూర్చి ఏమి చెప్పుకొన్నారు? మా జనము నాశనము కాకుండుటకు ఎస్తేరు కారణమైయున్నందున ఈ గ్రంథము Pentateuch (మోషే వ్రాసిన 5 కాండములు)కు తర్వాత గ్రంథముగా చేర్చబడును. ధర్మశాస్త్రమును పెనెటెట్యూకు అందురు. మొదటి గొప్ప పుస్తకము ఏదనగా, మోషే వ్రాసిన ఐదు పుస్తకములు కలిసిన ధర్మశాస్త్రము. అనగా Pentateuch అనే పుస్తకము తర్వాత గొప్ప పుస్తకము ఎస్తేరు గ్రంథము.

10. ఎందుచేత ఎస్తేరు గ్రంథములో దేవుని పేరు లేదో చెప్పుకొనండి.

జవాబు:– ఎస్తేరు గ్రంథమును అనగా పర్షియా గవర్నమెంటు వారి రికార్డులో కనబడిన ఎస్తేరు చరిత్రను, ఎస్తేరు నకలును తీసికొని

బైబిలులో అతికించిరి. ఇది అన్యుల రికార్డులోకి వెళ్ళవల్సినది. గనుక ఇందులో దేవుని పేరు లేదు.

11. దేవుని పేరు లేనందువల్లనే దేవుడు పరిపూర్ణముగా ఉన్నటువంటి గ్రంథమునకు సొగసొచ్చియున్నదని బైబిలు పండితులు అనుచున్నారు. యూదులు ఎక్కువగా ఈ గ్రంథమును మెచ్చుకొంటారు. అన్యురాలైన రూతు, యూదుడైన బోయజును చేసికొనెను. యూదురాలైన ఎస్తేరు అన్యరాజైన అహష్వేరోషును చేసికొనెను. ఉదా:- జూడిత్ అపోక్రిప. అపోక్రిప గ్రంథములు అనగా బైబిలులో చేర్చని గ్రంథములు. అనగా మలాకీ తరువాతను, మత్తయి పూర్వమందును గల గ్రంథములు. ఆ గ్రంథములలో ఒక గ్రంథము పేరు జుడిత్. ఎస్తేరు గ్రంథములో, రాజనగరులోనుండి దేవుని స్తుతించిన ఒకరినిగూర్చి నేర్చుకొంటిమి. అన్యులమధ్య దేవుని స్తుతించిన ఒకరినిగూర్చి ఎజ్రా గ్రంథములో నేర్చుకొంటిమి. నెహెమ్యా గ్రంథములో, పర్వతముల మధ్య దేవుని స్తుతించిన ఒక మనిషి యుద్ధరంగములో గలడు అని నేర్చుకొన్నాము. అలాగే జూడిత్ అనే స్త్రీ తన జనులను శత్రువుల హస్తమునుండి రక్షించిన కథ అపోక్రిపా గ్రంథములో యున్నది.

# ఎస్తేరు కథ

**తండ్రి: ఎస్తేరు 1:1-9; కుమా. 24:41; పరి. 2కొరి. 2:14**

దేవుడు ఇశ్రాయేలీయులకు తన కృపను అనేక విధములుగా కనుపర్చినప్పటికినీ వారు ఆయనమీద అనేక మారులు తిరుగుబాటు చేసినందున ఆయన వారిని శిక్షించెను. వారిని పదేపదే శిక్షించిన పిదప చివరకు వారిని చెరలోనికి పంపి బానిసలుగా చేసెను. ఈలాగు బానిసలుగా పర్షియా దేశమునకు కొనిపోబడిన వారిలో మొర్దెకై ఉండెను. ఈయనే ఎస్తేరును పెంచి పెద్దచేసెను. దైవసంకల్పమునుబట్టి

ఎస్తేరు అహష్వేరోషు రాజుయొక్క భార్య ఆయెను. ఈ పర్షియా చక్రవర్తి 127 రాజ్యములను పరిపాలించెను. హిందూదేశము మొదలుకొని కూషు వరకు ఉన్న దేశములన్నిటిని ఏలెను.

ఇండియా (హిందూదేశము) పేరు ఎస్తేరు గ్రంథములో తప్ప మరి ఎక్కడను బైబిలులో కనబడదు. అహష్వేరోషు గ్రీకు దేశముమీదికి దండెత్తి దానిమీద జయము పొందినందున, ఆ సంతోషమును తెలియపర్చుటకు గొప్ప విందు గావించి తన రాజ్యములోని సంస్థానాధిపతులనందరిని ఆ విందుకు పిలిచెను. అప్పుడు ఇండియా నుండి కూడ అధిపతులు ఆ విందునకు వెళ్ళిరి. ఆ విందు బహు ఘనముగా జరిగినందున రాజు, తన రాణియైన వష్తియొక్క సౌందర్యమును అందరకూ చూపించదలచెను. కానీ వష్తి నిరాకరించినందున, రాజు ఆమెను రాణిగా తొలగించి, ఎస్తేరును రాణిగా చేసెను. అయితే, యూదుడైన మొర్దెకై తనను గౌరవించనందున, మంత్రియైన హామాను యూదులనందరిని చంపుటకు తాకీదులు వ్రాసి, రాజుముద్ర వేయించెను. ఎస్తేరునందు రాజుకు మిక్కుటమైన ప్రేమయుండెను. దైవసంకల్పమునుబట్టి రాజు మొర్దెకైను తన సన్నిధిని ఘనపరచెను మిమ్ములను చంపుటకు వచ్చిన వారిని మీరే చంపుడని రాజు ఆజ్ఞ చేసెను. ఈ విషయములో ఎస్తేరు మూడు దినములు ఉపవాసము చేసెను. యూదులు తమ శత్రువులలో 7,500 మందిని చంపివేసిరి. ఈలాగు ఎస్తేరు వలన యూదులు రక్షింపబడిరి.

ఈ గ్రంథములో దేవుని పేరు లేదు గాని దేవుని సహాయ మున్నది. అలాగే ***ఆయన మనకు కనబడకపోయినా, రహస్యముగా సహాయము చేస్తూయున్నాడని దీనివలన గ్రాహ్యమగుచున్నది.*** ఒక స్త్రీ వలన అనేకమంది బ్రతికిరి. అహష్వేరోషు తన రాజ్యమహిమ చూపుటకు విందు చేయించెను. యేసుక్రీస్తు యువరాజు, భూలోకములో ఆయనకు

సంఘమున్నది. అహష్వేరోషు వష్తిని విడిచినట్లుగా, క్రీస్తు ప్రభువు తన్ను అంగీకరించని వారిని ఈ లోకములోనే విడిచిపెట్టును. ఉపవాస ప్రార్ధనలతో తయారైన ఎస్తేరును రాజు ఏలాగు చేర్చుకొనెనో, ఆలాగు సిద్ధపడిన వారిని; ఫిలిప్పును ఆత్మ కొనిపోయిన రీతిని ప్రభువు పరలోకమునకు కొంచుపోవును. వష్తివలె నామక క్రైస్తవులు విడువబడుదురు. ప్రస్తుతము ఈ సిద్ధపడే పని భూలోకమందే జరుగుచున్నది. ఇద్దరు తిరుగలి విసరుచుందురు. ఒకరు కొనిపోబడును, మరొకరు విడిచిపెట్టబడును. అనగా సిద్ధముగా ఉన్నవారు వెళ్ళిపోవుదురు, సిద్ధపడకుండా విసరువారు విడిచిపెట్టబడుదురు. సిద్ధపడకుండా తిరుగలి విసరువారు ప్రభువు వచ్చినప్పుడు సిద్ధపడలేమా!' అని అనుకొందురు. వష్తిరాణి గుంపువారు ఇక్కడనే ఉందురు. వీరే పిలువబడినవారు. ఈలాగు పిలువబడినవారు అనేకులు, ఏర్పర్చబడినవారు కొందరే (మత్తయి 24:41).

**ఎస్తేరు రాణి వంశమువారు ఎవరనగా,** 1. బైబిలు బాగుగా చదివినవారు, 2. ప్రార్ధన బాగా చేసినవారు, 3. సేవ బాగాచేసినవారు, 4. శ్రమలు బాగా అనుభవించినవారే పెండ్లికుమార్తెగా సిద్ధపడి ఎస్తేరు రాణి అంతస్థులో ఉండగలరు.

1) రాణీగా నుండుటకు ఎస్తేరు రాజునొద్దకు వచ్చెను. 2) ఎస్తేరు రాణిగా సిద్ధపడుటకు అనగా ఆమెను పెండ్లికుమార్తెగా తయారు చేయుటకు సహాయకారులగు స్త్రీలను, కావలసిన ఆభరణములను, వస్తువులను రాజు ఇచ్చెను. ఎస్తేరు 12 నెలలు సిద్ధపడిన మీదట అప్పుడు పెండ్లి అయినది. హేగే ఈమెను రెండు రకములైన వస్తువులతో రాణిగా సిద్ధముచేసెను. అవి ***1) చేదు వస్తువులు 2) సువాసన వస్తువులు.***

***1. చేదు వస్తువుల వివరము:*** చేదు సిలువకు గుర్తు. (సిలువ మీద యేసుప్రభువుకు చేదు చిరకానిచ్చిరి). ఈ చేదు, సిలువమీద ఆయన

పొందిన శ్రమలకు సాదృశ్యముగా ఉన్నది. ఎన్ని నిందలు వచ్చినా, కలత లేకుండా సహించవలెను. **ఇవి పెండ్లికుమార్తెకు తప్పనిసరిగా నుండవలెను.**

***2. సువాసన వివరము:-*** సువాసన అనగా రహస్యముగా కూడుకొనుట. ఈ సువాసన మనము రహస్యముగా ప్రభువు సువాసనలో గడువు సమయమునకు సాదృశ్యముగానున్నది. సువాసన ఏలాగు సుగంధ ద్రవ్యములనుండి వచ్చునో, ఆలాగే ఆయన దివ్య లక్షణములను బట్టి పెండ్లికుమార్తెకు సువాసన, సొగసు వచ్చును. సువాసన ఏలాగున బయటకు కనబడదో, ఆలాగే క్రీస్తుతో రహస్య సహవాసము చేయు వధువు సిద్ధబాటు బయటకు కనబడదు. ఈలాగు పెండ్లికుమార్తె ఆయన లక్షణములను రహస్యముగా తన అనుభవములోనికి తెచ్చుకొనుచు, సిద్ధపడుచుండును పెండ్లికుమార్తెగా సిద్ధపడువారు ఆత్మ బాప్తీస్మమును పొందవలెను. అనగా ఈ మానవాత్మను, దైవాత్మతో ఏకము చేసికొన పరిశుద్ధాత్మను రూపమును ధరించుకొనవలెను. సాధుసుందర్ సింగ్ గారు వ్రాసినట్లు 'బొగ్గును ఎంత కడిగిననూ దాని నలుపును తొలగించుట అసాధ్యము. అయితే అది కాల్చబడినపుడు దాని నలుపు మాయమైపోవుచున్నది. అలాగే పాపి పరిశుద్ధాత్మను పొందినపుడు అనగా అగ్ని బాప్తీస్మము పొందినపుడు, పాపము అను నలుపంతయు తొలగించబడుచున్నది. బొగ్గులోని అగ్నివలె పరిశుద్ధాత్ముడు మనలో నివసించుచుండును'; ఆయన చెప్పిన అనుభవము ఇప్పుడే నెరవేరు చున్నది. అదే ఇప్పుడు మనలో జరుగుచున్నది.

(1) రాజు వష్తీ రాణీని చంపుటకు ఒప్పుకొనలేదు, (2) పెండ్లికుమార్తెయైన ఎస్తేరును పోగొట్టుకొనలేదు. గాని వష్తిని, మంత్రియైన హామానును పోగొట్టుకొనెను. అలాగే ప్రభువుకూడ పెండ్లికుమార్తెను అనగా పరిశుద్ధ సంఘమును (కీర్తన. 22:30,31),

(దానియేలు 12:3) పోగొట్టుకొనడు. ఎస్తేరుకు తూర్పుదేశపు నక్షత్రమని పేరు. దానియేలు 12:3లో ఉన్నట్లు పెండ్లికుమార్తె వరుసలోనివారు నక్షత్రములవలెనుందురు రాజు వష్తిని చంపలేదు. అలాగే క్రీస్తుప్రభువు నామమన క్రైస్తవులను నశింపచేయక, వారిని 7సం॥ల శిక్షకు అప్పగించును. ఎస్తేరు గ్రంథములో అహష్వేరోషు రాజుపేరు 187సార్లు ఉన్నది గాని దేవునిపేరు ఈ గ్రంథమందంతటనూ రహస్యముగా ఉండి తన పని జరిగించుచుండెను.

నిర్గమకాండములో ఆయన 'చాటునుండి మాట్లాడెను' అని ఉన్నాది. ఉదా:- పొదచాటునుండి మోషేతో మాట్లాడుట, మేఘములో నుండి ఇశ్రాయేలీయులతో మాట్లాడుట. బైబిలులోని మిగిలిన పుస్తకములలోకూడ ఆయన చాటు చేసికొని మాట్లాడినట్లు వ్రాయబడి యున్నది. అనగా ***'మన కష్టనష్టములలో దేవుడు చాటునుండి సహాయము చేసియున్నాడు'*** అని మనము అనుకొనవలెను. అలాగే ఇక్కడ యూదులమీదకు వచ్చిన కష్టములో, ఆయన చాటునుండి వారిని ఆదుకొనెను. అందుకు యూదులు పూరీము పండుగ ఆచరించి ఒకరికొకరు బహుమతులు పంపుకొన్నట్లు, మనమును ప్రస్తుతము క్రిస్మస్ కాలములో బహుమతులు పంపుకొనుచున్నాము.

***ఎస్తేరు గుంపువారు చేయు ఆలోచన:-*** 1) బానిసనగు నన్ను రాజు ఎన్నుకొనునా? (ఇక్కడ అనుమానము లేదుగాని వినయము ఉన్నది). 2) 'బానిస' అని తెలిసిన యెడల కత్తివాత తప్పదు. 3) అయినను మనము ఏర్పర్చబడిన జనాంగము గనుక ధైర్యము తెచ్చుకొనెదము. ఈరీతిగా ఆలోచించువారు పెండ్లికుమార్తె వరుసలో ఉండగలరు. ***కత్తి తప్పదు' అని తెలిసిననూ సందేహించక, ధైర్యముగా ఉండువారు రాకడలో ఎత్తబడుదురు.***

Bible Mission HQ Guntur

**వష్తి గుంపువారు చేయు ఆలోచన:-** 1) ప్రభువు నన్ను పెండ్లికుమార్తె వరుసలో చేర్చునా! (అనుమానము, సందేహము). 2) 'పెండ్లివస్త్రము ధరించుకొనని నీవు ఇక్కడకు ఎందుకు వచ్చినావు' అని ప్రభువు అంటారేమోనని వీరు తలంచుదురు. మత్తయి 22:12లో నున్నట్లుగా వీరు ఈ పెండ్లికుమార్తె వరుసలోనికి వచ్చుటకు సందేహింతురు. గనుక వీరు రాకడలో ఎగిరి వెళ్ళలేరు. సందేహించువారు వష్తివలె విడిచి పెట్టబడుదురు. ఎస్తేరువలె ధైర్యముగా నుండి, వరుని ఎదుర్కొను భాగ్యము ప్రభువు ఈ పందిరిలో చేరినవారికి దయచేయును గాక. ఆమేన్.

# అన్న చరిత్ర

**తండ్రి: ఆది. 4:1-2; కుమా. 2:38; పరి. 1తిమో. 5:1-16**

**ప్రార్థన:-** స్తోత్రార్హుడవైన ఓ తండ్రీ! నీ ఆలయమునందు సమావేశము కాగల కృప అనుగ్రహించినందుకు స్తోత్రములు. మేము మరలా నీ వాక్య వివరములను విచారించుకొననైయున్నాము గాన నీ ఆత్మ సహాయమునిమ్ము. అప్పుడు నీ వాక్యములోని నిజసంగతులు గ్రహించగలము. నీ ఆత్మద్వారా మా మనస్సాక్షిని వెలిగించుము. అప్పుడు మాకు ప్రత్యక్షత కలుగును. నీ ఆత్మచేత మా ప్రయత్నమును వెలిగించుము. అప్పుడు మాకు ప్రత్యక్షత కలుగును. నీ ఆత్మచేత మా ప్రయత్నములను వెలిగించుము. అప్పుడు మాకు నీవాక్యాపేక్ష కలుగును. మరియు నీ వర్తమానము ఒక్కొక్కరికి అనుగ్రహించుము. నీ వాక్య ధ్యానములో వ్యతిరేక సంగతులు రాకుండునట్లు సహాయపడుమి త్వరగా వస్తున్న ప్రభువుద్వారా వేడుకొంటున్నాము ఆమేన్.

అన్న ఆషేరు గోత్రికురాలు. ఈమె పనూయేలు కుమార్తె. ప్రవక్త్రి ఉద్యోగము గలది. శిశువైన ప్రభువు దేవాలయమునకు తెచ్చినపుడు,

ఆమెకూడ లోపలికి వచ్చినది. ఈమె ఉపవాసపరురాలు, ప్రార్ధనా పరురాలు. ఆమె నివాసము దేవాలయమే. ఈమె 84 సం॥ల అనుభవముగలది. ఇశ్రాయేలుయొక్క విమోచననుగూర్చి కనిపెట్టువారితో ఈమె సహవాసము చేసెడిది. ఈమె ఉపవాసము చేసినదని, ప్రార్థించినదని బైబిలులో ఉన్నది. ఇవి రెండును రెండు గొప్ప పనులు.

సృష్టియారంభమున నిలువబడిన స్త్రీ హవ్వ. నాలుగువేల సం॥లు మరియొక స్త్రీ వచ్చెను. ఆమె ప్రభువు తల్లియైన మరియ. ఇప్పుడు హవ్వను గూర్చి అన్ననుగూర్చి తెలుసుకొందాము. పై ఇద్దరివలె (హవ్వ, మరియమ్మ), వీరిద్దరునూ (హవ్వ, అన్న) వ్యతిరేకమైన స్త్రీలు. అన్న అనేక ఉపవాస ప్రార్థనలు చేసినది. ఈమె ఉపవాసానికి వెనుక ఉన్న 4 వేల సం॥లు క్రిందకు వెళ్ళితే అక్కడ హవ్వ ఉన్నది. హవ్వ, దేవుడు తినవద్దని చెప్పిన ఫలము తిన్నది. అది ఉపవాసముకాదు గాని తిండి. హవ్వ అపాయకరమైన కానిపండును తిన్నది; అన్న తిండి మానివేసినది! ఇద్దరికి ఎంత బేధము! మనకాలములోను తినకూడనివి తిని జబ్బులు తెచ్చుకొనేవారున్నారు. ఉపవాసముండకుండా, కొందరు అనేక ప్రార్థనలు చేయుదురు. అయిననూ వారికి నెరవేర్పు త్వరగా ఉండదు. హవ్వ తిండి మెచ్చుకోదగినదికాదు. అన్న ఉపవాసము మెచ్చుకోదగినది. మనమును ఉపవాసము చేస్తే అన్నవలె ధన్యులౌతాము. ఒక రోజంతా ఉపవాసముండి ప్రార్థనచేస్తే, ఎన్నో సంగతులు మనకు బైలుపడును.

అన్న ముందు చేసిన పని ఉపవాసము, తరువాత చేసిన పని ప్రార్థన. మధ్యలో చేసినపని ఇతరులతో మాట్లాడుట. రక్షకుడు వచ్చి మనలను విమోచించునని, రక్షకుని కొరకు ఎదురుచూచేవారితో ఆమె చెప్పినది. అవి 1) మంచిమాటలు, 2) ఆదరణ మాటలు, 3) సంతోషమగల మాటలు. తాను చెప్పదలచినవారితోనే ఆమె ఆ మాటలు చెప్పెను.

హవ్వ- 'నాకు సర్పము కనబడినది, పండు తినమన్నది, నీకు తెచ్చినానని' చెప్పకూడని మాటలు చెప్పింది. పిశాచి సంబంధమైన మాటలు, అపాయకరమైన మాటలు, పాపములో పడవేసే మాటలు చెప్పింది. అన్న అయితే రక్షణ మాటలు, విమోచన మాటలు, యోగ్యమైన మాటలు, ఉపయోగకరమైన మాటలు చెప్పెను. అలాగే మనమును మన మాటలలో మేలున్నదా? కీడున్నది? అని ఆలోచించవలెను. హవ్వవలె ఉండకుండా, అన్నవలె మేలుకరముగా ఉండవలెను.

అన్న- 1) ఉపవాసము, 2) మేలుకరమైన సంభాషణ, 3) ఇతరులకు ప్రార్థన నేర్పినది. ***ఉపవాసము చేసిన విలువ, రేయింబవళ్ళు చేసిన విలువ, అన్న చేసిన ఆ ప్రార్థనలో యున్నది.*** వెల కట్టాలంటే మన ప్రార్థనకు ఏమి వెలకట్టగలము! అన్న ప్రార్థనకు 'ఉపవాసము, రాత్రింబగళ్ళు' అనే విలువ ఉన్నది. మనమును అన్న మాదిరి నేర్చుకొని అలాగు చేయవలెను. అన్న అయితే దేవుని సన్నిధిలో ఉపవాసముండి మనవులునూ, ప్రార్థనలునూ చేసి జవాబులుపొంది, వాటిని ఇతరులకు చెప్పినది.

హవ్వ- దేవుని సన్నిధిలోనుండి పారిపోయినది. అంతకుముందు దేవుని సహవాసము చేసిన క్రీస్తు, ఇప్పుడు పారిపోయినది. ఎంత దుస్థితి! అన్న పాత నిబంధనలోని కడవరి స్త్రీ, క్రొత్త నిబంధనలోని మొదటి స్త్రీ. మనలో ఎంతమంది దేవుని సన్నిధిలోనుండి పారిపోతున్నాము? అన్నవలె దేవుని సన్నిధిలోకి వెళ్ళాలి గాని పారిపోకూడదు. మనమెంత ఎంత పాపులము! ఎంత అవిశ్వాసులము! ఎంత ఇష్టములేని వారమైనను బలవంతముగానైనను, దేవుని సన్నిధికి వెళ్ళవలెను, గానీ హవ్వమ్మవలె చెట్టుచాటు దాగియుండేవారమై యుండకూడదు. మనము సన్నిధిలోనికి వెళ్ళితే 1) పాపము పోవును, 2) దేవునిమీద ఇష్టము కలుగును, 3) బలము

కలుగును. ఆ కుటుంబీకురాలు అనగా భర్త ఉన్న హవ్వమ్మ ఈ పని చేయలేదు గాని భర్తలేని అన్నమ్మ ఈ గొప్ప పని చేయగలిగినది. పాప విషయములు విసర్జించి, అన్నమ్మ మాదిరి అన్ని విషయములలో అవలంభించిన యెడల దేవుని వలన మెప్పు పొందుదుము.

**అన్నలోని నాలుగు విషయములు:-** 1. ఇతరులతో మాట్లాడి ఆదరించుటనేది గొప్ప సేవయేగాని, ప్రార్థించి ఉపవాసము చేయుటే అన్నిటికి మించిన సేవయని అనవచ్చును. 1) ఉపవాసము చేయుట, 2) ప్రార్థించుట 3) ఉపవాసముండి పగలు ప్రార్థనచేయుట, 4) ఉపవాసముండి రాత్రి ప్రార్థనచేయుట. ఈ నాలుగును గొప్ప సేవయై ఉన్నవి. "మనుష్యులను తమ పాపములనుండి లాగి, రక్షకునియొద్దకుచేర్చే సేవకొరకై ఎక్కడికి వెళ్ళక సోమరిగా గుడిలో స్త్రపవాసముండి సేవచేయుచున్నావా! ప్రార్థిస్తున్నావా!" అని అన్నవలె చేయువారిని చూచి నిందించే లోకపు మనుష్యులు ఉన్నారుకదా!

**ఉపవాసము చేయుట, ప్రార్థించుట ఆ గొప్ప సేవకంటే గొప్ప సేవ.**

1) దేవునిని నిందించుట, 2) మనుష్యులను నిందించుట, 3) సువార్త ప్రకటించుట; ఈ మూడు సేవలు అన్నమ్మ సేవకంటే తక్కువైన సేవే. ప్రభువా! నీ నామమున దయ్యములను వెళ్ళగొట్టలేదా? సువార్త ప్రకటించలేదా? అని అడిగినవారి విషయములో; దయ్యములను వెళ్ళగొట్టి, అద్భుతములతో కూడిన సేవ చేసినవారిని అంత్యదినముల యందు ఆయన అంగీకరించలేదు. ప్రియులారా! సువార్త సేవ అనగా మనుష్యులను ఆదరించుట. దేవుని సేవించుటలోఉండి ప్రార్థించక, ఉపవాసము చేయకపోతే, పై మూడును వెళ్ళిపోవును. **దేవుని సన్నిధిలో బలము పొందకపోతే, సైతానుని ఎదిరించలేము,** దుష్టులైన మనుష్యులను ఎదిరించలేము. అన్న ఎంత ధన్యురాలు! 1) ఉపవాసము చేసిన స్త్రీ,

2) బోధించే స్త్రీ, 3) ప్రార్థించే స్త్రీ, 4) ప్రవక్త్రియైన స్త్రీ అని లూకా వ్రాసెను. ఈమె ఏ పుస్తకములు వ్రాసినది! గాని ఈమె గొప్ప ప్రవక్త్రి.

**అన్న చేసిన పనులు:-** 1) ఉపవాసప్రార్థన, 2) ప్రార్థన ప్రార్థన, 3) స్తుతి ప్రార్థన, 4) సువార్త పని, 5) బైబిలు చదువుట. పై మూడు దేవుని సన్నిధిలోనివి. చివరి రెండు వెలుపల చేయవలసినవి. 80 సం॥ల వయస్సులో పై నాలుగు గుణములు గల అన్నమ్మ, పాత నిబంధనయొక్క చివరి కాలములో మరియు క్రొత్త నిబంధనయొక్క మొదటిలో అనగా ప్రభువు మొదటి రాకడలో నిలువబడి, పై నాలుగు సంగతులు చెప్పుచున్నది. మొదటి రాకడ మొదలు రెండవరాకడ వరకు మనము ఉన్నాము, అనగా ఈ 2015వ సం॥ము వరకు ఉన్నాము. ఆమె మొదటి రాకడ స్త్రీయైతే మనము రెండవరాకడ (సంఘ స్త్రీ) జనమై యున్నాము.

**అన్న మనకు నేర్పు పాఠము:-** 1) మొదటిరాకకు ఆమె కనిపెట్టగా, ఆమె నిరీక్షణ నెరవేరెను. అలాగే మనమును కనిపెట్టు చున్నాము. గనుక మన నిరీక్షణకూడ తప్పక నెరవేరును. ఏ విధముగా నెరవేరును? ఒక ముసలాయన, ఒక ముసలమ్మ ఉన్నారు. ఆ ముసలాయన (సుమెయోను) సలాము చెప్పి వెళ్ళి చనిపోయెను. ప్రభువును చూచి చనిపోయెను. అయితే, ఆమె చనిపోయినట్లు రికార్డులో లేదు. 1) సుమెయోను మృతుల గుంపునకు గుర్తు. 2) అన్న సజీవుల గుంపునకు గుర్తు. రేపు ప్రభువు వచ్చినప్పుడు ఆదాము మొదలుకొని రేప్చర్ వరకు చనిపోయినవారికి, సుమెయోను సూచనగా ఉన్నాడు. సజీవులకు అన్న సూచనగా ఉన్నది. మృతులైన వారితో కలవక, పెండ్లికుమార్తె వరుసలోని సజీవులు రెండవ రాకడ వరకు ఉందురని లూకా చెప్పుచున్నాడు మొదట మృతులు తరువాత, సజీవులు మేఘములోనికి వచ్చెదరు. మనము ఏదో ఒక గుంపునకు తయారు

కావలెను. మనము ***ఎన్ని శ్రమలున్ననూ, ఊగులాడుచునైనా బిగబట్టుకుంటే సజీవుల గుంపునకు తయారుకాగలము.*** వయస్సు చాలకపోతే మృతుల గుంపులో ఉండండి. (1) సజీవులు, (2) మృతులు రేపు రాకడలో పాల్గొందురు. వీరు పెండ్లికుమార్తెగా రాకడలో వెళ్లుదురు. నేనింకా చెప్పుచున్నాను. అట్టి రాకడకు ఎందరెందరు సిద్ధము కాగలరో!

యెరూషలేములోనున్న దేవాలయములోనికి ప్రభువుని తీసికొని వచ్చినప్పుడు అన్న సుమెయోనులు లోపలికి వచ్చిరి. వారు వచ్చినప్పుడు దేవాలయములో మొదటిరాక రక్షకుడున్నాడు. మొదటి రాకడలో 1) బేబీ (శిశువైన యేసు) గుడిలో ఉన్నాడు. రెండవ రాకడలో 2) పెండ్లి కుమారుడైన ప్రభువు మేఘములో ఉన్నారు. వారు గుడిలోనికి పోయిరి. అలాగే మనము మేఘములోనికి పోవలెను. క్రొత్త సంగతి: అన్న చరిత్రలో ఆమె సం॥లు కుటుంబీకురాలుగాను, 84 సం॥లు వితంతువుగాను ఉండెను. అది చాల విచారకరమైన సంగతి. 7సం॥లు లోకసంబంధమైన మంచితనము దేవుడు ఆమెకు ఏర్పర్చెను. లోకములోని మంచి 7 సం॥లు గలదు, 84 సం॥లు దేవాలయములోని మంచి కలదు. ఇది ఆమె ఆత్మీయ జీవితము. మొదటిదైన లోకజీవితములో లోకములోని సజ్జనులతో కలిసియుండుట. ఆత్మీయజీవితము అనగా పరిశుద్ధులతో, దూతలతో, దేవునితో కలిసియుండుట. ఈ 84 సం॥లలో, ఆ మొదటి 7 సం॥లులు అంతా మంచివి కావుగాని అంతకన్నా ఎక్కువ మంచి స్థితిలో మిగిలిన సం॥లలో గలదు. లోక జీవితము మంచిది గాని తరువాతి జీవితము ఇంకా చాలా ఎక్కువ మంచిది. అది 12 రెట్లు గొప్పది. ఈ గొప్ప దీవెన మీకందరకూ కలుగునుగాక! ఆమేన్.

# అన్న అనుభవము

**తండ్రి: ఆది. 30:13; 32:30; 49:20; కుమా: లూకా 2:36-38; పరి. 1పేతురు 4:7.**

**ప్రార్థన:-** మాతో నిత్యము మాట్లాడుచున్న మా తండ్రీ! మేమిప్పుడు నీ నామమున సమావేశమైనాము. నేడు మేము చేయుచున్న ఆరాధనలోని ప్రతి అంశముద్వారా నీకు మహిమ కలుగునట్లు దీవించుము. మా జ్ఞానము వెలిగించుము, అప్పుడు మరుగైన విషయములు గ్రహింతుము. ఆత్మను వెలిగించుము, అప్పుడు జ్ఞాన నేత్రములకు కనబడని విషయములు వచ్చును. మనస్సాక్షిని వెలిగించుము, అప్పుడు నీ వాక్యము నమ్మగలము. ప్రత్యక్షతను వెలిగించుము, అప్పుడు నీ వాక్యమునందు స్థిరముగానుందుము. నీ వర్తమానమును బట్టి నూతన విశ్వాసములో సాగిపోయే కృప దయచేయుము. ఈ కూటమునకు రాలేని బలహీనులను దీవించుము. రాకూడని వారిని అడ్డగించుము. మా బ్రతుకులో రాకూడని వాటిని రానీయకుమని త్వరగా వచ్చుచున్న యేసు నామమున వేడుకొనుచున్నాము ఆమేన్.

అన్న చరిత్రలోని విషయములన్నిటిని బట్టి మన బ్రతుకులను సరిచేసికొందుము గాక! ప్రభువు జన్మించిన ఎనిమిది దినములకు ఆయనను మరియమ్మ, యోసేపులు గుడికి తీసికొని వెళ్ళిరి. బెత్లేహేము నుండి యెరూషలేముకు ఐదుమైళ్ళు దూరము ఉండెను. సుమెయోను అనే భక్తిపరుడు లోకరక్షకుడైన ఈయన కొరకు కనిపెట్టి వారిలో ఆఖరువాడు. అన్నమ్మకూడ ఆ రక్షణ చూచే భాగ్యము పొందెను. అన్న ఆషేరు గోత్రీకురాలు. ఇశ్రాయేలీయులలో 12 గోత్రములున్నవి. ఈ వంశములో ఆషేరు గోత్రములో పుట్టిన పనూయేలు కుమార్తె అన్న. ఈమె 7 సం॥లు భర్తతోను, 84 సం॥లు దేవాలయములోను నివాస

స్థలము ఏర్పాటుచేసికొని ఉపవాసముండి ప్రార్థన చేయు స్థితిలో నుండెను. ఇది ఈమెను గూర్చిన కథ. ఇది మూడవ పర్యాయము కనబడుచున్న చరిత్ర. యాకోబు అను భక్తునికి ఆషేరు అనే కుమారుడు ఉన్నాడు. యాకోబు పద్దనరామునుండి వచ్చుచుండగా యబ్బోకు రేవువద్ద అనగా పనూయేలు దగ్గర రాత్రిఅంతా ప్రార్థనలో ఉండెను.

ఆ చరిత్రను విడిచి ఇంకా ముందుకు నడచిరాగా ఆయన కుమార్తె అన్న గలదు. ఇది ఆదికాండములోని చరిత్ర. ఇది ఆదికాండము నుండి మధ్య పుస్తకములు, ఆ తర్వాత మలాకీ దాటి, బెత్లెహేము వరకు రావలెను. ఈమె ఆషేరు గోత్రీకురాలు అనగా పాతనిబంధన చివర కాలమందలి, క్రొత్త నిబంధనలోని మొదటనున్న యాకోబుయొక్క మనవరాలు. ఆషేరుకు ఆశీర్వాదము అనగా భాగ్యమనే భోగమున్నది. ఆషేరు గోత్రములోనివారు భాగ్యవంతులు, ధనికులు. ఈ గోత్రములోనున్న నన్ను భాగ్యవంతురాలందురు అని అతని తల్లి మురుసుకొనెను. భాగ్యవతి, సౌభాగ్యము అని మనము వాడుకొను ఈ పేరులు ఆషేరునుండి వచ్చినవే. ఆ పేర్లు వినవచ్చినప్పుడు ఆషేరు గోత్రము తలంచుకొనవలెను. ఏ విషయములో? లోక సంబంధముగా ఏదైనా అవసరత ఉన్నపుడు ఈ పేరు జ్ఞాపకము తెచ్చుకొండి. యబ్బోకు రేవు దగ్గర యాకోబు రాత్రంతయు ప్రార్థనలో ఉన్నాడు. పశువులను, మనుష్యులను రేవు దాటించి, తాను ప్రార్థనలో ఉండెను. ఆ స్థలము పెనూయేలు అని పిలువబడెను. యాకోబు చాలా సమయము ప్రార్థించినాడు. రాత్రియంతా ప్రార్థించగా, ఆయనతో పోరాడిన పరలోక వాస్తవ్యుడైన వ్యక్తి దీవించి వెళ్ళిపోయినాడు. యాకోబు భయపడి నేను ప్రభువును ముఖాముఖిగా చూచి ప్రాణము దక్కించుకొన్నాననెను. పెనుయేలు = దైవసన్నిధి. నీ గదిలో నీవు ప్రార్థించునపుడు అది దైవసన్నిధే. ఆ యాకోబు వంశములోనుండి వచ్చిన పనయేలులో నుండి

అన్న బైలుదేరెను. అన్న లోకరక్షకుని కొరకు కనిపెట్టి లోపలకు వెళ్ళి, శిశువును చూచెను. ***ఆమె తాతగారు ప్రభువునుచూచి, భయపడెను. గాని అన్న భయపడక సంతోషముతో ఆనందించెను, దేవుని స్తుతించెను*** లూకా వ్రాసెను. మనము ముఖాముఖిగా దేవుని చూడలేము. అన్న భాగ్యవంతురాలే. ఎందుకనగా యాకోబు దేవుని సన్నిధిలో ఉన్నాడు. అట్టి స్థితి అన్నకు అలవాటైనదని జ్ఞప్తి ఉంచుకొనండి.

మానవ జీవితములు రెండు విధములుగానున్నవి. 1) లోక సంబంధమైన జీవితము, 2) ఆత్మ సంబంధమైన జీవితము. ఆషేరు దీవెన లోకసంబంధముగా గొప్పది. ఐగుప్తులో యాకోబు ఆలాగు దీవించెను. యాకోబు– 'ఆషేరునకు శ్రేష్టమైన ఆహారము (భోజనము) కలదు' అని దీవించెను. అందరూ తినునది సామాన్య ఆహారము. ఆషేరు తినునది శ్రేష్టమైన ఆహారము. ఎంత ధన్యుడు. ఎంత భాగ్యవంతుడు! ఇది యాకోబు దీవెన మాత్రమేకాదుగాని ఆయన ప్రవచనమై యున్నది. మరియు రాజులకు కావలసిన మధుర పదార్ధములు ఆషేరువల్ల వారికి దొరుకును అని ప్రవచించెను. ఒకదానికంటే ఇంకొక దీవెన ఎక్కువగానే కనిపించుచున్నది.

తనకునూ, ఇతర రాజులకును కావలసిన శ్రేష్టమైన ఆహారము ఆషేరు దగ్గర ఉండెను. ఆ స్థితి అన్నలో కనబడుచుండెను. తరువాత మోషే వచ్చి, అన్ని గోత్రములను దీవించెను. ఆషేరును ఎక్కువుగా దీవించెను. 'ఆషేరు తన పాదములు తైలముతో పెట్టుకొనగల ఎక్కువ తైలముగలవాడై యుండెను.' అనగా ఆషేరు ఎక్కువ కటాక్షము పొందెను అని అర్ధము. సాధారణముగా తైలమును తరచుగా తలకు రాస్తాము. పాదములకు ఎప్పుడోరాస్తాము. తలకు రాయగా, ఇంకా మిగిలిన నూనె పాదములకు రాస్తాము. అయితే ఈ గోత్రములో తైలము పాదలముకు పెట్టుకొనునంతగా దొరుకుచున్నది. 1. శ్రేష్ట ఆహారము 2. మధుర

పదార్థములు ఆషేరునొద్ద ఉండునని యాకోబు దీవించెను. 1) తైలము దొరుకును 2) సమృద్ధిగా దొరుకును అని మోషే దీవించెను. (1) నా గిన్నె నిండి యున్నది, (2) పొర్లిపారుచున్నదని దావీదు వ్రాసెను. ఇది దావీదు అంతరంగ అనుభవమైయున్నది.

ఆషేరునుండి పనూయేలు వరకు వచ్చిన దీవెన, అక్కడనుండి మోషేవరకు సాగి, మలాకీ దాటి, బెత్లేహేము వరకు వచ్చి, అచ్చటనుండి అన్నవరకు రాగా, ఆషేరు నుండి అన్నవరకు ఈ దీవెన ప్రయాణించిన కాలము 1800 సం॥లు అయినది. మనము ఆ మొదటి జీవితము జీవించుచున్నాము అని దీ.కీర్తన 23వల్ల (నూనెతో నా తల అంటి యున్నావు) తెలుసుకొనుచున్నాము. ప్రభువు పరిసయ్యుని ఇంటిలోనికి రాగా, పాపాత్మురాలు ఆయన పాదములకు అత్తరు పూసినది. ఆమె ఎట్టి స్త్రీయో ఈయనకు తెలియదా? అని కొందరు అనుచున్నారు. ఆయన పాదములకు ఆమె పూసిన అత్తరు విలువ గొప్పది. ప్రకటనలో ఉన్న (అపరంజిని పోలిన పాదములు), ఆమె పూసిన అత్తరుకంటే ఆయన పాదములు మహా విలువైనవి. ఆహారము, మధుర ఆహారము, తైలము; వీటినిబట్టి అవి ఇచ్చిన ప్రభువును పూజించాలి. లేయా, పనూయేలు, అన్నలవంటి దీవెనలు మనకునూ కావాలి. ఆషేరు గోత్రము పాలెస్తీనా దేశములని ఏ ప్రాంతములో నివసించునో ఆ స్థలము త్రివ్వితే ఇనుము, ఇత్తడి దొరుకును. 1) భూమి పైన ఉన్న శ్రేష్టమైన ఆహారపదార్థములు, 2) భూమిలోపల ఉన్న ఇనుము, ఇత్తడి వీరికి దొరుకును. అన్ని రీతులుగాను ఆషేరు గొప్పది. లేయా, యాకోబు, మోషే చెప్పిన సంగతులు, ఇచ్చిన దీవెనలు ఆషేరు విషయములో ఎంతో నిజములై యున్నవి. ప్రవచనమువలన విశ్రాంతి బలము కలుగును. తినవలసినది తిని, వ్యాపారానికి ఇత్తడి, ఇనుము దొరికితే మనసుకు బలము, సంతోషముగదా! ఎంత ధన్యత! పాత నిబంధన ముగించినాము,

క్రొత్త నిబంధన ఆరంభించినాము. మధ్య పనూయేలు, ఈయన కుమార్తెయైన అన్న ఉన్నారు, వంశపారంపర్యముగా చూచినపుడు అన్నకు ఆహారము కొదువయై యుండకూడదు. ఇనుము, ఇత్తడికి కొదువయై యుండకూడదు. ఈ ఆషేరు గోత్రికురాలికి తిండికి తక్కువలేదు కానీ, ఈమె రెండవ వరుస అవలంభించినది. అనగా ఆత్మీయ జీవినమునకు అవసరమైన వరుస అవలంభిచినది.

అన్న ఏడు సం॥లు బాగా తిన్నది. భర్త వెళ్ళిపోగానే, ఈమె దేవాలయమైన దేవుని ఇంటిలో ఉండి ఆహారము మానింది. ఇదే గొప్ప భాగ్యము. ఈమె ముఖ్యమైన పని ఉపవాసము. ఆషేరు గోత్రములో పుట్టి శ్రేష్టమైన పదార్ధములుగలదైనను, ఇనుము, ఇత్తడిగలదైనను, ఉపవాసమును వీటికంటె ఎక్కువగా ఎంచుకొన్నది గనుక ఈమె చిక్కులేదు, వణకలేదు, బాధపడలేదు. మోషే, ఏలియాలు 40 దినములు ఉపవాసమున్ననూ, పై మూడును వారికి కలుగలేదు వారివలె అన్నకుకూడ గొప్ప బలము వచ్చినది.

ఏలియా, మోషే, అన్న; వీరు ముగ్గురు ఒక వరుస. అన్న 1) దేవాలయములో ఉన్నది. 2) దేవాలయములోనికి వెళ్ళినది, 3) దేవాలయము ఉపవాసమున్నది. 4) ప్రార్థించినది, 5) విశ్వాసులతో మాట్లాడినది. ***అన్నవలె ఈ ఐదు అనుభవములు కలిగియున్న యెడల, అన్న ధన్యతను, వారసత్వమును మనమును అందుకోగలము.*** ఆమె ఉపవాసములోనే తన సమయమును గడుపలేదుగానీ ప్రార్ధనలోను ఉన్నది. ఏమి ప్రార్థించినదో తెలియదు, గానీ గొప్ప గొప్ప ప్రార్థనలు చేసినది. ఈమె తాతగారైన యాకోబు యబ్బోకు రేవువద్ద ఒంటరిగా రాత్రంతయు ప్రార్థించెను. అన్న రాత్రి, పగలుకూడా ప్రార్థించెను. ఆయన ఒక్క రాత్రే గాని ఈమె అనేక రాత్రులు ప్రార్థించెను. యాకోబు పగలు ప్రార్థించలేదు. ఈమె పగలు ప్రార్థించినది. యాకోబుకంటే ఈమె ఎంత

ధన్యురాలు! యాకోబు ఒక్క రాత్రేగానీ ఈమె అనేక రాత్రులు, అనేక పగళ్ళు ప్రార్థనలో గడిపినది.

అన్న తన భర్తతో గడిపిన 7 సం॥లు సంతోషకరములా? లేక భర్తలేకుండా ముసుగువేసికొని గడిపిన 84 సం॥లు సంతోషకరములా? ముసుగువేసికొని గడిపినవే సంతోషకర సంవత్సరములు. పగలును పోలినవి 7 సం॥లు రాత్రిని పోలినవి 84 సం॥లునైయున్నవి. 84 సం॥లు గడిపిన వయస్సు అంతయూ కలిపినా అది రాత్రి గనుక అది అంతయు ఒక రాత్రికే సమానము. తాతగారు పడిన ఒక్క రాత్రి ప్రయాసకు అది సాదృశ్యముగా ఉన్నది. అన్న చరిత్ర ఎరిగినవారు, అన్న ఎన్ని మంచి పాఠములు నేర్పించినదంటారు! మీరును రోజుకు ఒక్క పర్యాయమైన రాత్రి ఒక గంట, పగలు ఒక గంట దేవుట సన్నిధిలో ఉంటే, యాకోబుకు, అన్నకు దొరికినట్లు మనకును దొరుకును. పాత నిబంధనలోని ఒక పురుషుడు, క్రొత్త నిబంధనలోని ఒక స్త్రీ ఆలాగుచేయగా మనమెందుకు చేయకూడదని పౌరుషముతో మీరును చేయండి. అన్నకు దొరికిన శరీరదీవెనలు, ఆత్మసంబంధమైన దీవెనలు మీకును దొరుకునుగాక! ఆమేన్.

# అన్న ప్రార్థన

**తండ్రి: కీర్తన 45; కుమా: లూకా. 18:1-8; పరి. 1థెస్స. 3:7-9.**

ధ్యానాసక్తిపరులారా! దేవుని ఎదుట మెప్పుపొందే దీవెన మీకు కలుగునుగాక! అన్న అను దైవజనురాలు 84 సం॥లు దేవాలయములో ఉండి, ఉపవాస ప్రార్థనలు చేయుచుండెను. ఈమె 7 సం॥లు కుటుంబీకురాలు ఉన్నది. ఆమె బస దేవాలయములోనే, ఆమె భక్తిపరురాలు. ఆమె చరిత్రలో రెండు సంగతులు గలవు (ఇంకా అనేకములు గలవు). అవి 1) ఉపవాసము చేసేది 2) ప్రార్థనలు చేసేది.

అన్నలో గల రెండు గొప్ప లక్షణములు ఏవనగా, ఉపవాసము మరియు భోజనము చేయకుండ ప్రార్థనలో గడిపే జీవితము. ***అట్టి మనలో ఎవరైనా ఉన్నారా?***

**భర్తలేనివారు గమనించవలసిన విషయములు:** ఉపవాసము, ప్రార్థన. అన్న ఈ రెండు గొప్ప పనులు చేసెను. నీతిగానుండుట, భక్తిగానుండుట సుమెయోను స్వభావము. అయితే ఉపవాసముండుట, ప్రార్థనచేయుట అన్న స్వభావము. ఇవి రెండు, రెండు గుణములు. తరచుగా ప్రార్థన చేయుట గొప్ప విషయముకదా! తరచుగా ప్రార్థనలో ఉండుటనుబట్టి వండుటకు, తినుటకుకూడ ఆమెకు ఖాలీలేదు. ప్రార్థన ముఖ్యముకదా! ***లోకములో ప్రసంగము చేయుట సుళువు.*** అనగా మనుష్యులతో మాట్లాడుట తేలిక. ప్రార్థన అనగా, దేవునితో మాట్లాడుట గనుక బహు కష్టము. ఉపవాసము సుళువే. ఈ వేళ తినకపోతే రేపు తినవచ్చును. అయితే కష్టమైన పని ఏదనగా ప్రార్థనచేయుట. ఆమెకు అదే గలదు. ఆమెకు 1) ఉపవాసముండే పని, 2) ప్రార్థన చేసే పని గలదు.

ఆమెకున్న మూడవ పని ఏదనగా, యెరూషలేములో విశ్వాసులు గలరు. వారు ప్రభువుయొక్క మొదటి రాక కొరకు కనిపెట్టేవారు. ఆమె వారికి ప్రభువు మాటలు చెప్పది. ***అన్న ఇంటిలో ఉపవాసము, గుడిలో ప్రాకయిర్థన చేస్తూ, బయటికిపోయి రక్షకుడు వస్తాడని చెప్పేది.*** ప్రార్థించే స్త్రీ, బైబిలు బోధకురాలైనది. ఇవి ఒకదానికంటే మరొకటి మించిన పనులైయున్నవి. ***ఉపవాసమునకు మించినపని సేవ. దానికి మించిన పని ప్రార్థన.*** యెరూషలేములోనివారు విమోచనకొరకు అనగా రక్షకుని కొరకు కనిపెట్టుచుండగా ఆమె వారికి ఆ సంగతులు చెప్పుచుండెడిది. అన్నవలె ఉపవాసము చేసే సమర్థత, ప్రార్థనచేసే సమర్థత, ప్రకటించే సమర్థత మీకును లభించుగాక! ఇదే

నేటి దిన దీవెన వర్తమానము సుమెయోనువలె నీతిపరులముగాను, భక్తిపరులముగా మరియు అన్నవలె మూడు సమర్ధతగల దీవెనలు, మొత్తము ఐదు దీవెనలు మనము కలిగి ఉండవలెను.

అన్న ఉపవాసమెందుకు చేయుచుండెననగా, **ఆమె రేయింబవళ్ళు ప్రార్ధనలో ఉండుటనుబట్టి, ఆమెకు ధారాళముగా ప్రార్ధన వచ్చుచుండెను.** ఆలాగే వండుటకు, తినుటకు ఆమెకు వేళలేదు గనుక ఆమె ఉపవాసము చేసేది. ఇక్కడ ఉన్నవారిలో ఒక్కపర్యాయమైనా, ఉపవాసము చేసేవారున్నారా? లేకపోతే ఉపవాసము చేయండి. మనకు కష్టాలు, నష్టాలు ఎందుకుపోవు? ఉపవాసప్రార్ధన చేయకపోవుటను బట్టియే. గనుక దేవునిని గట్టిగా పట్టుకొనుటకు ఉపవాసము చేయవలెను. 'నేను వస్తే నీవు బయటికి వెళ్తావు? విను' అని దేవుని గట్టిగా పట్టుకొను పని చేయవలెను. అన్న చేసేది బోధకుల పనికాదు, గానీ విశ్వాసులతో మాట్లాడేపని. అన్యులతో, అవిశ్వాసులతో మాట్లాడుటకాదు గానీ నిరీక్షణగల వారితో ఆమె మాట్లాడుచుండెను. విధవరాలి ఘోష ఎక్కడికి వెళ్ళును. గుడిలోనే ఉండును గనుక ఆమె మొదటిరాకను గూర్చిన నిరీక్షణ సంగతులే మాట్లాడుచుండెను.

ఆ గుడిలో అన్నవలె ప్రభువుకొరకు కనిపెట్టేవారున్నారా! ఉంటే వారు గుడికి రాని అన్యులకు బోధింపవలెను. వారు విశ్వాసులతో మాట్లాడవలెను. ఏమని? రాత్రి నాకు ప్రభువు దర్శనమందు 'బయట మీరు అలాగున్నారని తెలియజేసిరి' అని చెప్పవలెను. రాకడలో ఎగిరి వెళ్ళుట కొరకు త్వరలో సిద్ధముగా ఉండవలెనని చెప్పవలెను. ఒకరితో ఒకరు మాట్లాడుకొనవలెను. కనిపెట్టేవారితో చెప్పవలెను. ఇదే అన్న చేసిన పని. మన అనుభవము విశ్వాసులకు మాత్రమే చెప్పవలెను. విశ్వాసులు మాత్రమే అనుభవము గ్రహించగలరు. అన్యులైతే అపార్ధము చేయుదురు.

Bible Mission HQ Guntur

అన్న 84 సం॥లు దేవాలయములో ఉండి మూడు పాఠములు నేర్పించెను. ***1. ఉపవాసముండండి, 2. ప్రార్థనచేయండి, 3. మాట్లాడండి.*** ఇతరులు అడిగితే అనుభవము చెప్పక బోధ చెప్పవలెను. ఇది అన్న పాటములో ఉన్న మాదిరి. అన్న అనుభవమును మీరును కల్గి ఉండి, అనేకులను రాకడకు ఆయత్తము చేయుటకు పెండ్లికుమారుని కృప మీకు తోడైయుండునుగాక! ఆమేన్.

ప్రార్థన:- గొల్లల మాటలు మరియ ముద్రించుకొన్న రీతిగా ఈ వర్తమానము విన్నవారు తమలో ముద్రించుకొను కృప దయచేయుము.

# సమరయ స్త్రీ

**తండ్రి: ప.గీ. 4:12-15; కుమా. యోహా 4:1-45; పరి. 2కొ. 3:17-18**

సమరయులు అనగా షోమ్రోను పరిసర ప్రాంతములయందు నివసించువారు. వీరు పాతనిబంధనలోని ఇశ్రాయేలు 10 గోత్రములకు సంబంధించినవారు. కాలక్రమేణా వీరు తమ భక్తిని, మతనిష్ఠను విడిచిపెట్టి అన్యులతో కలిసికొనుటనుబట్టి, యూదా గోత్రీకులు (అనగా నేటికి యూదులుగా ఉన్నవారు) వీరిని తమలో కలవనివ్వక, దూరము ఉంచిరి. గనుక ఈ సమరయులు ద్వేషింపబడినవారని వారి మాటల వలననే తెలియుచున్నది. క్రీస్తుప్రభువు సువార్త వలవేసి ఈమెను రక్షణలోనికి తెచ్చెను. ఉదా:- పావురములు పెంచువాడు అడవి పావురములను పట్టుకొనుటకు ప్రయత్నించుచుండును. ఒకవేళ ఆ పావురము అతనికి మైదానములో కనబడిన పారిపోవును. కొట్టిన యెడల చచ్చును. గనుక అతడు ముందు గింజలు చల్లును. ఆ గింజలు తిని ఆ అడవి పావురము పారిపోవును. అతడు మరల చల్లును. ఆ అడవి పావురము తిని మరలా ఎగిరిపోవును. అయినను అతడు మరల గింజలు చల్లును. ఆ తరువాత వాటికి అలవాటుపడి, భయము తగ్గిన తరువాత నెమ్మదిగా పెంపుడు పావురములగును.

యూదయ, గలిలయ మధ్య సమరయ గలదు. యూదయలోని ఆయనను హింసించిరి. యూదులు, సమరయకు వెళ్ళరు. చుట్టు తిరిగి వెళ్ళుదురు. క్రీస్తుప్రభువు సమరయలో సుకారు అను ఊరు వెలుపలకు వెళ్ళి, అక్కడ నూతి దగ్గర కూర్చుండెను. ఊరు వెలుపల బావి తవ్వించుట వారి ఆచారము. ఆ సమయములో శిష్యులు రొట్టెల కొరకు వెళ్ళిరి. ఆ స్త్రీ నీళ్ళకు వచ్చెను. ఆమె చరిత్ర క్రీస్తుప్రభువు చెప్పిన మాటలలో ఉన్నది. ఈయన నీళ్ళు అడిగెను గాని ఆమె ఇయ్యలేదు. క్రీస్తుప్రభువు జీవజలమును గురించి, ఆరాధన గురించి చెప్పెను. ఈ కథ చిన్న మాటలలో పూర్తిగా చెప్పవలెను. ఆమె బ్రతుకు మంచిదికాదు, ఆమె చెడిపోయిన స్త్రీ. ఆమె బ్రతుకు అడవి బ్రతుకు. ఆమె ఆత్మను అడవి పావురముతో పోల్చవచ్చును. ***ఈ అడవి పావురమును శుద్ధి చేయుటకు పరిశుద్ధాత్మ పావురము వచ్చెను.*** ఈ అడవి పావురమును గ్రామ పావురమును చేయవలెను, పెంపుడు పావురమును చేయవలెను. ఈ పావురమును పట్టుకొనుటకు క్రీస్తుప్రభువు ప్రయత్నించెను. ఈ పావురము దొరకని పావురము. ఇది పారిపోవునది, తప్పించుకొనునది, బిడియముగల పావురము గనుక క్రీస్తుప్రభువు ఆమెను పలకరించెను. క్రీస్తుప్రభువు నీళ్లకు వచ్చెను. ఆమెకూడ నీళ్లకు వచ్చెను గనుక క్రీస్తు ప్రభువే మాట్లాడుట సబబుగానేయున్నది. ఆమెను ఏమి అడిగిన సబబుగా నుండును! అందుకే ఆయన నీళ్ళిమ్ము అమ్మా! అని అడిగెను ఎంత తప్పు యూదులు ఆలాగున అడుగరు. పరిచయము చేసికొనుటకు క్రీస్తుప్రభువు అట్లు అడిగెను. అమ్మా! అనుటయే పావురమునకు మొదటిసారి గింజలు చల్లుట. అప్పుడామె నీవు యూదుడవు. నేను సమరయురాలనని చెప్పి పారిపోయెను. ఆమె వంశద్వేషము ఎత్తెను. క్రీస్తుప్రభువు విసుగుకొనలేదు. ఆమెను రక్షింపనుద్దేశము క్రీస్తు ప్రభువు కలిగియుండెను. రెండు స్థలములకు ఆ పావురము పారిపోయెను.

అనగా 1) యూదుల జనాంగముయొద్దకు 2) సమరయుల జనాంగము యొద్దకు పారిపోయెను.

మరలా ప్రభువు ఆ పావురమునకు గింజలువేసెను. రెండు సంగతులు చూపించెను 1) దేవుని వరమును; 2) నన్ను అనగా క్రీస్తును తెలిసికొనిన యెడలనూ, ఆ మాటలు చెప్పవు అనగా వంశద్వేషము ఎత్తవు అని చెప్పెను. 'నీవే నన్ను అడుగుదువు. నేను జీవజలమును ఇచ్చెదనని' చెప్పెను. అప్పుడామె నిలువబడెను. ఆమె ఆత్మ ఈ రెండింటిని ఆలోచించుచుండెను. ***జీవజలము*** అనగానేమి? అని ఆమె ఆలోచించుట మొదలుపెట్టెను. ప్రభువు ఆ పావురమునకు బోధ గింజలు వేయుచుండెను. జీవజలము గురించి ఎప్పుడు ఆమె వినలేదు. మొదటి పర్యాయము ప్రభువు చెప్పుచుండెను. ఇప్పటివరకు ఎవరికి అది అర్థము కాలేదు. మరలా ఆమె చేద దగ్గరకు, లోతు బావి దగ్గరకు పారిపోయెను. అనగా యేసుప్రభువు పరలోక సంభాషణ మొదలుపెట్టగానే ఆమె లోక సంభాషణకు పారిపోయెను. ప్రభువు ఆమెపోయిన స్థలమునకు వెళ్ళి తగిన జవాబు చెప్పి ఆ పావురమును ఆకర్షించుకొనెను.

ఇంకను ఆమె యాకోబు, పశువులు, కుమారులు అనగా, ఎక్కడికో మోషేముందున్న యాకోబు దగ్గరకు పారిపోయెను. 'యాకోబు గొప్పవాడు, నీవు అంతకన్న తక్కువవాడవని' ప్రభువుతో ఆమె అనెను. యూదులు సమరయులను తక్కువగా నెంచిరి. అయితే, ఆమె ఇక్కడ ప్రభువును యాకోబుకంటే తక్కువవాడని చెప్పెను. అయినను 'మన' అనుటద్వారా, ఆమె కొంచెము బంధుత్వము కలిగించుకొనెను. 'మన తండ్రి యాకోబు గనుక మనము సహోదరులము' అని బంధుత్వము కలిగించుకొనెను. నూతిటబట్టి యాకోబు వచ్చెను. అబ్రాహాము, ఇస్సాకు అని అనలేదు. పారిపోయిన ఆ పావురమునకు ప్రభువు మరలా గింజలు వేసెను. 'ఈ నీరు త్రాగువారికి మరలా దాహమగును. నేనిచ్చు నీరు

త్రాగువారు మరలా దప్పిగొనరని' చెప్పి యాకోబు బావి నీరుకన్నా ప్రభువు ఇచ్చు జీవజలము ఎక్కువని చెప్పెను. అప్పుడు ఆ నీరు కావలెనని ఆమెకు ఆశ కలిగెను. అదే ప్రభువు ఆ పావురమునకు వేసిన మేత గనుక ఆ అడవి పావురము దొరికినది. ఎవరునూ వినని మాటలు, ఆ స్త్రీయొద్ద ప్రభువు చెప్పెను. ఈమె చాలా ధన్యురాలు. యేసు– 'నేను ఇచ్చునది జీవజలము, నీటి బుగ్గ' అని చెప్పెను. ***ఆమెకు జీవజలముమీది ఆశ కలిగి అన్నిటిని మరచిపోయెను.*** ఆ స్త్రీ– 'నేనింత దూరము రాకుండ, నాకు దప్పికకాకుండ ఆ నీళ్ళిమ్మనెను'. ఆమె దృష్టి ఇంకను లౌకికముమీదనే ఉండెను. ఆ నీరు నాకు కావలెనని పావురము అనెను. అప్పుడాయన– 'నీవు నాకు నీరు ఇవ్వలేదు' అనకుండ జీవజలము ఆమెకు ఇచ్చుటకు సిద్ధముగానుండెను. ఆయన అడవి పావురమును ఈలోకపు నీటినుండి జీవజలమువద్దకు లాగుచుండెను.

అడిగిన వెంటనే ప్రభువు ఆమెకు జీవజలమియ్యలేదు. ఆమెను దాహమునకిమ్మని ప్రభువు అడిగితే, ఆమె ఇచ్చినదా ఏమి? అట్లివ్వకుండా ప్రభువు ఆమెను తన పాపస్థితి దగ్గరకు ముందు నడిపించెను. పావురములను పెంచువారు, గూటినుండి వాటిని తోలివేసినట్లు ప్రభువు ఈ పావురమును తోలివేసెను. అప్పుడు ఆమెకు తన చెడ్డస్థితి జ్ఞాపకము వచ్చెను. మరలా ఆ పావురము పారిపోవుచుండెను. 'పెనిమిటి లేదు' అని చెప్పుటవలన ఆ స్థలమునకు నడిపించెను. గాని ఆ పావురము పాపస్థితిని విడిచిపెట్టుటకు ఇష్టములేక మరియొక చోటికి పారిపోయెను. ప్రభువు తోలిన స్థలము విడచి ఇంకొక స్థలములోనికి పారిపోయెను. చివరికి ప్రభువు తోలిన స్థలమునకు వచ్చెను. ఆయన సహవాసములో, ఆయన పెంపకములో స్థిరపడెను. ఈలాగు ఆయన పెంపుడు పావురములుగా స్థిరపడి, మహిమ మేఘమెక్కు ధన్యత చదువరులకు కలుగునుగాక. ఆమేన్.

Bible Mission HQ Guntur

# హాగరు

**తండ్రి: ఆది. 16:1-12; యోహా 8:31-38, 57-59; పరి. గల 4:28-31.**

హాగరు శారా దాసియై ఉండెను. ఈమె శారా సమ్మతి చొప్పున అబ్రాహామునకు కనిన కుమారుని బట్టి శారా ఆగ్రహమునకు గురి అయ్యెను, చివరకు శారా మాట చొప్పున అబ్రాహాము హాగరును, ఆమె కుమారుని నీళ్ళతిత్తితోను, కొద్ది ఆహారముతోను పంపివేసెను. ఆమె బెయేర్షెబా అరణ్యములో ఎటూ తోచక సంచరించుచున్నది. హాగరుయొక్క కండ్లు దుఃఖమువలనను, విచారమువలనను మూయబడియుండెను. అయితే, అబ్రాహాము ఇంటిలో పెరుగుటనుబట్టి ఆమె లోపల చూచే శక్తి, వినేశక్తి గలవు. ఆలాగే బయటి అవయవములకుకూడ అదేశక్తి గలదు. దేవదూత ప్రసంగపు మాటలు హాగరుతో చెప్పెను. 'దేవుడు ఆ బిడ్డ మొఱ్ఱ వినెను, భయపడకుము' అని ధైర్యపరచెను.

**హాగరు స్థితి:-** 1) ఆమె అబ్రాహాము ఇంటినుండి వెళ్ళగొట్టబడెను. 2) ఒంటరిగా వెళ్ళుచుండెను. 3) అరణ్యములో నీళ్ళు లేకయుండెను. ఈ కష్టములలో ఆమె మరణము యొక్క అంచున ఉండెను. ***'మిక్కిలి ఆపదలోనున్నప్పుడు దేవునియొక్క సహాయము మనకు వచ్చును'.*** అని హాగరు దృష్టాంతమునుబట్టి తెలియుచున్నది. ఆమె మిక్కిలి నిరాశలోయుండెను. ఎటూ తోచక ఏమీ పాలుపోక ఉండెను. అయితే, తీరా అపాయము వచ్చిన తరువాత, చివరన దేవుని సహాయము తటాలున దొరుకును.

దేవుడు మన కొరకు ఏమి చేయవలెనో అవన్ని ముందే సిద్ధము చేసి ఉంచినాడు మనము ఏడ్వనక్కరలేదు. హాగరు కొరకు ఊటను ముందే సిద్ధముచేసి ఉంచినాడు. ***మనకు కావలసిన సహాయములన్ని దేవుడు ముందే చేసినాడు. మనము కండ్లు మాత్రము తెరువవలెను.***

దేవుని సహాయము ముందే ఉండును. ఆ తరువాత కష్టము ఉండును. దేవుడు సహాయము ముందే చేసియుంచినను, కొందరు దానిని పొందలేరు. విచారములో ఉండుదానినిబట్టి పొందలేరు. అయితే ప్రార్థించినపుడు దేవుడు సహాయము చేయును, నమ్మిక పుట్టును. ఆ వెంటనే దేవుని సహాయము దొరుకును. మోక్షము ఉచితముగా ఇవ్వబడినది. మనము సొమ్ముపెట్టి కొననక్కరలేదు. మనుష్యులు ఇచ్చునదంతా సొమ్ముకొరకే ఇత్తురు. ***అయితే, దేవుడు ఇచ్చు సహాయమునూ ఉచితముగానే ఇచ్చును.***

1. మనిషి తన దుస్థితి తెలిసికొనవలెను, 2. ప్రార్థన చేయవలెను, 3. నమ్మవలెను, 4. అప్పుడు సహాయము దొరుకును. నీళ్ళగుంట దగ్గరగానేయున్నది. అలాగే రక్షణ దగ్గరగానే యున్నది. మనము అందుకొనుటలోనే అంతయు ఉన్నది. దూత మాటలు హాగునకు ఆదరణ కలిగించెను. ఆలాగే దేవుని వాక్యము వలన మనకు ఆదరణ కలుగును, విచారము పోవును. అన్నిటికి విరుగుడు దేవుని వాక్యమే. హాగరు కోరుకొనినది నీళ్ళుగాని ఆమెకు మొదట దూతవలన సహాయము దొరికెను. దేవునియొద్దనుండి వచ్చు సహాయములు మనకు ఎప్పుడూ చాలినంతగా ఉండగలవు. అనగా సమృద్ధిగానే ఉండును ***గాని మన విశ్వాసమునుబట్టి తీసికొనుట ఉండును. నీళ్ళ గుంటలో నీళ్ళు చాలా ఉన్నవి గాని హాగరు తీసికొనినది, తిత్తి నీళ్ళు మాత్రమే.*** దేవుడు సమృద్ధిగా ఇచ్చును గాని గిచ్చిపట్టి ఇవ్వడు, ఆయన సహాయమెప్పుడూ చాలనట్లు ఉండదు. అపనమ్మిక, నిరాశ అనునవి గొప్ప పాపములు. ఇష్మాయేలు నీళ్ళు లేనందున ఏడ్చెను. ఆ ఏడ్పే దేవుడు ప్రార్థనగా ఎంచుకొనెను. ఆ పిల్లవాడు నిజముగానే నీళ్లకొరకు ప్రార్థించియుండవచ్చును. మనము చేసే ప్రతి ప్రార్థనను ఆయన ఆలకించును. ఆలాగే మన ప్రతి ప్రార్థనకు దేవుడు జవాబు ఇచ్చును. ఆ నమ్మకముతోనే ప్రార్తన చేయవలెను. అట్టి స్థితిని ఇక్కడ చేరినవారికి పెండ్లికుమారుడు దయచేయునుగాక. ఆమేన్.

బైబిలులోని

# విఖ్యాత వనితలు

“ప్రభువు మాట సెలవిచ్చుచున్నాడు,
దానిని ప్రకటించు స్త్రీలు గొప్ప సైన్యముగా ఉన్నారు” కీర్తన 68:11.


గ్రంథకర్త

**యం. దేవదాసు అయ్యగారు**



గుంటూరు - 2023 చందా : 15.00



Bible Mission HQ Guntur

గుంటూరు నందు :

| | | | |
|---|---|---|---|
| మొదటి ముద్రణ | 2004 | ప్రతులు | 2000 |
| రెండవ ముద్రణ | 2004 | ప్రతులు | 5000 |
| మూడవ ముద్రణ | 2015 | ప్రతులు | 2000 |
| నాల్గవ ముద్రణ | 2017 | ప్రతులు | 2000 |
| ఐదవ ముద్రణ | 2019 | ప్రతులు | 3000 |
| ఆరవ ముద్రణ | 2023 | ప్రతులు | 1000 |

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలు పరచిన

# బైబిలు మిషను ప్రచురణ

ముద్రణ :

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.

ఫోన్ : 9949121777.

Bible Mission HQ Guntur

# విషయసూచిక


| క్రమ సంఖ్య | అంశము | | పేజి. నం. |
|---|---|---|---|
| 1. | రూతు చరిత్ర | – | 1 |
| 2. | రూతు కథ | – | 6 |
| 3. | రూతు తీర్మానము | – | 9 |
| 4. | రూతు సమర్పణ | – | 16 |
| 5. | హన్నా చరిత్ర | – | 19 |
| 6. | హన్నా స్తుతి | – | 22 |
| 7. | హన్నా అనుభవము | – | 27 |
| 8. | ఎస్తేరు చరిత్ర | – | 30 |
| 9. | ఎస్తేరు కథ | – | 34 |
| 10. | అన్న చరిత్ర | – | 39 |
| 11. | అన్న అనుభవము | – | 45 |
| 12. | అన్న ప్రార్థన | – | 50 |
| 13. | సమరయ స్త్రీ | – | 53 |
| 14. | హాగరు | – | 57 |


Bible Mission HQ Guntur